2nd pages111.qxd 5/10/2025 8:00 PM Page 1

Sweken IT Solutions
Technology at your finger tips
WE ARE HIRING !!
POWER BI SPECIALIST
DATA ANALYST
INTERESTED CANDITATES
PLEASE SEND YOUR RESUME TO
MAIL: careers@sweken.com
PH: 9100986585

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

విలేఖరులు కావలెను
విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళంలో అన్ని జిల్లాలకు విలేఖరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్ : 7013785256, 9959867303

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 191 విశాఖపట్నం, 11 మే 2025 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00



# ఉద్రిక్తతలకు తెర

## కాల్పుల విరమణకు భారత్, పాక్ అంగీకారం

**ఢిల్లీ :** గత కొన్ని రోజులుగా భారత్-పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడింది. కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించినట్లు భారత విదేశాంగశాఖ ప్రకటించింది. శనివారం సాయంత్రం 5గంటల నుంచి ఇవి అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. అంతకుముందు ఇదే అంశంపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్- పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకరం చాయని, ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని ప్రకటించారు. శనివారం సాయంత్రం భారత విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. "మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ స్థాయిలో ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. పాకిస్థాన్ డీజీఎంఓ భారత డీజీఎంవోకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ఇరు దేశాల సైనికాధికారులు అంగీకరించారు. సాయంత్రం 5గంటల నుంచి ఇది అమల్లోకి వచ్చింది. భూ, గగన, సముద్రతలాల నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతుంది. వీటికి సంబంధించి ఇరుదేశాల సైన్యానికి తగిన ఆదేశాలు వెళ్లాయి. ఈ నెల 12న సాయంత్రం డీజీఎంవోలు మళ్లీ చర్చలు జరుపుతారు" అని విదేశాంగ మంత్రి విక్రమ్ మిస్రీ వెల్లడించారు.

**ఉగ్రవాదంపై రాజీపడేది లేదు: జైశంకర్**

ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణపై విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ ఎక్స్ వేదికగా స్పందించారు. కాల్పుల విరమణ, సైనిక చర్యలను నిలిపివేయడంపై భారత్, పాక్ ఈ రోజు ఓ అవగాహనకు వచ్చాయన్నారు. ఉగ్రవాదం విషయంలో మాత్రం భారత్ తన రాజీలేని వైఖరిని కొనసాగిస్తుందని పేర్కొన్నారు.

# ఉగ్ర చర్యలను యుద్ధంగానే పరిగణిస్తాం

## భారత్ స్ట్రాంగ్ వార్నింగ్

## త్రివిధ దళాల అధిపతులతో మోదీ సమావేశం

**ఢిల్లీ :** ఉగ్రవాదులు, వారికి మద్దతు పలికే వారికి భారత్ తాజాగా స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. దేశంలో ఇక నుంచి ఎటువంటి ఉగ్రదాడులు జరిగినా 'యుద్ధ చర్య'గానే పరిగణిస్తామని స్పష్టం చేసింది. అందుకు తగు విధంగా స్పందిస్తామని భారత ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడిరచాయి. భారత్-పాక్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాలపై పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులతో వరుసగా దాడులకు పాల్పడుతోంది. విమానాశ్రయాలు, సామాన్య పౌరులే లక్ష్యంగా దాయాది ఈ చర్యలకు దిగుతోంది. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితులపై ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన.. భారత సాయుధ దళాల అధిపతులతో న్యూఢల్లీలోని తన నివాసంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా పాల్గొన్నారు.

పాకిస్తాన్ 26 భారత స్థావరాలపై దాడి చేసినందుకు ప్రతిస్పందనగా శనివారం తెల్లవారుజామున



పాకిస్తాన్‌లోని నాలుగు వైమానిక స్థావరాలపై భారతదేశం దాడులు చేసిన తరువాత ఈ సమావేశం జరిగింది. భారత్.. పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య జరుగుతున్న పరిణామాల గురించి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ శనివారం ఉదయం మీడియాకు వివరించారు.

భారతదేశంపై పాకిస్తాన్ తీసుకుంటున్న చర్యలు రెచ్చ గొట్టేవిగా కనిపిస్తున్నాయని విక్రమ్ మిస్రి నొక్కిచెప్పారు. పాకిస్తాన్ రెచ్చగొట్టే

(మిగతా 2లో)

# కాల్పుల విరమణకు భారత్-పాక్ అంగీకరించాయి

## -మా మధ్యవర్తిత్వం ఫలించింది

## - అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన



**వాషింగ్టన్:** భారత్- పాకిస్థాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు తన ట్రూత్‌సోషల్‌లో శనివారం సాయంత్రం ఓ పోస్ట్ పెట్టారు. "అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. తక్షణమే కాల్పుల విరమణ చేపట్టేందుకు భారత్, పాక్ అంగీరించాయి. సరైన సమయంలో ఇరు దేశాలు విజ్ఞతతో, తెలివిగా వ్యవహరించాయి. అందుకు ధన్యవాదాలు" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

ట్రంప్ పోస్ట్ చేసిన కాసేపటికే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో సైతం ఇదే తరహా ప్రకటన చేశారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. భారత్, పాక్ ప్రధానులు నరేంద్రమోదీ, షెహబాజ్ షరీఫ్, భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసిమ్ మునీర్, ఇరు దేశాల జాతీయ భద్రతా సలహాదారులు అజిత్ దోభాల్, అసిమ్ మాలిక్‌లతో మాట్లాడినట్లు చెప్పారు. తాను, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇందుకు సంబంధించిన చర్చల్లో పాల్గొన్నామని పేర్కొన్నారు.

# అన్నీ ఆపేయడానికి మేము సిద్ధం!

## పాకిస్తాన్ కాళ్ల బేరం



**ఇస్లామాబాద్:** భారత్ - పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తార స్థాయికి చేరిన వేళ పాకిస్తాన్ విదేశాంగ మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. ఉద్రిక్తతలు తగ్గింపునకు తాము సిద్ధమని ప్రకటించారు. భారత్ దాడులు చేయడం ఆపితే.. తామూ ఆపేస్తామని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని తాము అమెరికాకు చెప్పామని వెల్లడించారు. మరోవైపు.. సరిహద్దుల్లో పాక్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయని భారత సైన్యం పేర్కొంది. పంజాబ్‌లోని అమృత్‌సర్ ఖాసా కంటోన్మెంట్‌పై పాక్ డ్రోన్ దాడులు ప్రయోగిస్తోందని వెల్లడించింది. పాక్ డ్రోన్లను వచ్చినవి వచ్చినట్లు సమర్థవంతంగా కూల్చివేసినట్లు తెలిపారు. పాక్ తరచూ కవ్వింపు చర్యలకు దిగుతోందని.. సాధారణ పౌరులపై దాడులకు తెగబడుతోందని.. ఇది సరైన పద్ధతి కాదని వార్నింగ్ ఇచ్చింది.

ఎలాంటి దాడులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని పాక్ ఆర్మీకి భారత సైన్యం సవాల్ చేసింది. ఇదిలా ఉండగా.. భారత్ సరిహద్దు ప్రాంతాల్లో శుక్రవారం పాక్ డ్రోన్స్, మిస్సైల్స్‌తో దాడికి పాల్పడింది. ఈ క్రమంలోనే దాయాదికి ఇండియన్ ఆర్మీ తన పవర్ ఏంటో చూపించింది. అందుకు స్ట్రాంగ్ కౌంటర్ ఇస్తూ భద్రతా బలగాలు శనివారం తెల్లవారుజామున భారీ స్థాయిలో పాక్‌పై ప్రతిదాడికి దిగాయి. ముఖ్యంగా పాకిస్తాన్ మిలిటరీ ప్రధాన కేంద్రమైన రావల్పిండిని లక్ష్యంగా చేసుకుని భారత్ బాలిస్టిక్ మిస్సైల్స్, డ్రోన్లతో దాడులు జరిపింది. ఈ దాడుల్లో పాకిస్తాన్ను భారత్ తీవ్రంగా విరుచుకుపడింది. ఈ క్రమంలోనే పాక్ ఉద్రిక్తతలు తగ్గించుకునేందుకు సిద్ధమని ప్రకటించినట్లు తెలుస్తోంది.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సువర్ణావకాశం

## ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్

## కొండకిండాంలో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన

**బొండపల్లి (విజయనగరం), (విశాఖ సమాచారమ్):-** ప్రతీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గజపతినగరం నియోజకవర్గ పరిధిలోని బొండపల్లి మండలం కొండకిండాం గ్రామంలో సుమారు 57.49 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. తొలిదశలో రూ.17.80 కోట్లతో సుమారు 25 ఎకరాల్లో ఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఇదొక సువర్ణావకాశమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేసి, పరిశ్రమల స్థాపనకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు. పరిశ్రమకు అవసరమైన స్థలాన్ని అందించడంతో పాటు సబ్సిడీలు, బ్యాంకు రుణాలు, మార్కెటింగ్ అవకాశాలు, ఇతర రాయితీలు కూడా అందు బాటులో ఉన్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరిశ్రమలను స్థాపిం చడం ద్వారా తాము ఉపాధి పొందడమే కాకుం




డా, మరికొందరికి ఉపాధి కల్పించినవారు అవుతారని అన్నారు. పండించే పంటల ఆధా రంగా కూడా ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేయవచ్చునని సూచించారు. ప్రతీ కుటుంబం నుంచీ ఒక వ్యాపారవేత్త ఉద్భవించాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశమని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగానే ఉద్యోగాలు లభిస్తాయని, వలసలను అరికట్టవచ్చునని

(మిగతా 2లో)

# బిక్కుబిక్కుమంటున్న తెలుగు విద్యార్థులు

**బాంబుల మోత మధ్య భయాందోళన**
**కాపాడాలని కేంద్రమంత్రి బండి సంజయ్ కు విద్యార్థుల విజ్ఞప్తి**
**విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు పంపుతున్న యంత్రాంగం**



భారత్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో జమ్మూ కాశ్మీర్లోని తెలుగు విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. భారత్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో జమ్మూ కాశ్మీర్లోని తెలుగు విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. జమ్మూలో కాల్పులు, బాంబు దాడుల కొనసాగుతుండడటంతో వారు భయాందోళన చెందుతున్నారు. జమ్మూ కాశ్మీర్ లోని షేర్-ఇ-కాశ్మీరీ వ్యవసాయ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఎస్కేయుఏఎస్టీ) లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన 23 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. బాంబుల మోతతో ఆందోళన చెందుతున్నామని, తమను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఎయిర్పోర్టులు కూడా మూసేయడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు విన్నవించారు. స్పందించిన ఆయన అక్కడి కలెక్టర్, యూనివర్సిటీ డీన్తో మాట్లాడారు. ఆయన చొరవతో విద్యార్థులను జమ్మూకాశ్మీర్ అధికార యంత్రాంగం సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధమైంది. తెలంగాణ, ఏపీ, తమిళనాడుకి చెందిన మొత్తం 23 మంది విద్యార్థులను తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మరోవైపు పంజాబ్లోని ఎల్పీయూ యూనివర్సిటీలో చదువుతున్న పలువురు తెలుగు విద్యార్థులు ఢిల్లీకి చేరుకున్నారు. భారత్, పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో పంజాబ్లో యూనివర్సిటీల పరీక్షలు వాయిదా వేశారు

**సరిహద్దుల్లో ఉద్రిక్తత**

## స్వస్థలాలకు తెలుగు విద్యార్థులు

**శ్రీనగర్:** భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో శ్రీనగర్‌లోని ఎన్ఐటీలో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్ఐటీలో 300 మందికిపైగా విద్యార్థులు ఉండగా.. వీరిలో పలువురు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉన్నారు. సరిహద్దుల్లో బాంబుల మోతతో ఆందోళన చెందుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. తమను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఏపీ, తెలంగాణ విద్యార్థులు లేఖ రాశారు. దీంతో కేంద్ర మంత్రి తక్షణమే స్పందించారు. జిల్లా కలెక్టర్, వర్సిటీ డీన్‌తో మాట్లాడారు. సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు. దీంతో ఏపీ, తెలంగాణ, తమిళనాడుకు చెందిన మొత్తం 23 మంది విద్యార్థులను బస్సుల్లో శ్రీనగర్ నుంచి ఢిల్లీకి పంపించారు. అక్కడి నుంచి స్వస్థలాలకు చేరుకోనున్నారు.

# 27న కేరళకు నైరుతి రుతుపవనాలు



**ఢిల్లీ:** ఈసారి దేశంలోకి నైరుతి రుతుపవనాలు అంచనాల కంటే ముందే ప్రవేశించనున్నాయి. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించడం ద్వారా దేశమంతటా వర్షాలు మొదలవుతాయి. జులై 8 నాటికి ఇవి దేశమంతా విస్తరిస్తాయి. మళ్లీ వాయవ్య భారతం నుంచి సెప్టెంబరు 17తో రుతుపవనాల ఉపసంహరణ మొదలై అక్టోబరు 15 నాటికి ముగుస్తుంది. ప్రస్తుతం ఇవి జూన్ 1 కంటే ముందుగా మే 27న కేరళను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ శనివారం ప్రకటించింది.

గతేడాది మే 30న రాగా.. 2023 జూన్ 8న, 2022 మే 29న దేశంలోకి ప్రవేశించాయి. ఈ సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. భారత ఉపఖండంలో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే ఎల్‌నినో పరిస్థితుల అవకాశాన్ని సైతం తోసిపుచ్చింది. మన దేశంలో 52% నికర సాగు భూమికి ఇప్పటికీ వర్షపాతమే ప్రధాన ఆధారం. దేశ మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో ఈ సాగు భూమి నుంచి ఏకంగా 40% దిగుబడి వస్తుంది. అందుకే భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. దేశవ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైన జలాశయాలను తిరిగి నింపడానికి, దేశ జీడీపీకి 18.2 శాతం తోడ్పాటుకు ఇది ఎంతో ముఖ్యం.

**తెలంగాణలో మూడు రోజులు వర్షాలు**

తెలంగాణలోని పలు జిల్లాల్లో మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయని పేర్కొంది. ఇవాళ పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 కి.మీ. నుంచి 40 కి.మీ. వేగంతో

(మిగతా 2లో)

విశాఖ సమాచారమ్

ఆదివారం 11-5-2025

# అణ్వాయుధాల వైపు.. పాక్ చూపు?

ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం కానీ యుద్ధం నడుస్తున్న విషయం తెలిసిందే. ఉగ్రవాదులపై దాడి చేస్తే.. పాక్ ఏకంగా యుద్ధానికి కాలు దువ్వుతూ.. సరిహద్దుల్లో కాల్పులకు తెగబడుతోంది. సామాన్య పౌరుల ఇళ్లను కూడా లక్ష్యంగా చేసుకొని పిచ్చిగా ప్రవర్తిస్తోంది. అది సరిపోదన్నట్లు ఫైటర్ జెట్లతో డ్రోన్లతో క్షిపణులతో భారత సైనిక స్థావరాలపై దాడికి యత్నిస్తోంది. వీటన్నింటిని ఎప్పటికప్పుడు భారత సైన్యం తిప్పికొడుతుండటంతో.. ఇక లాభం లేదని పాకిస్థాన్ ఏకంగా అణుబాంబును రెడీ చేస్తున్నట్లు అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తం అవుతుంది. అందుకు కారణం తాజాగా పాకిస్థాన్ ప్రధాని షహెబాజ్ షరీఫ్ నిర్వహించిన ఓ మీటింగ్. ఈ విషయాన్ని పాకిస్థాన్ ఆర్మీ ధృవీకరించింది.

పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ శనివారం నేషనల్ కమాండ్ అథారిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారని పాక్ సైన్యం తెలిపింది. ఈ అథారిటీ అనేది దేశ అణ్వాయుధ నిల్వలతో సహా భద్రతా నిర్ణయాలు తీసుకునే పౌర, సైనిక అధికారుల అత్యున్నత సంస్థ. ఈ వారంలో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు తారా స్థాయికి చేరుకున్నాయి. డ్రోన్లు, ఇతర మందుగుండు సామగ్రిని పంపడం ద్వారా వారి వైమానిక సరిహద్దులను ఉల్లంఘించారని, కనీసం 48 మంది మరణించారని రెండు దేశాలు ఆరోపించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో అణ్వాయుధాలను పర్యవేక్షించే అథారిటీతో పాక్ ప్రధాని సమావేశం నిర్వహించడం చర్చనీయాంశమైంది. అయితే.. పాక్ బెదిరింపులకు పాల్పడుతుందని నిపుణులు అంటున్నారు.

భారత్, పాకిస్థాన్ రెండూ అణ్వాయుధాలు కలిగిన దేశాలు కావడంతో ప్రపంచం మొత్తం భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలకు భయపడుతోంది. తాజాగా ఈ రెండు దేశాల మధ్య సైనిక సంఘర్షణను తక్షణమే తగ్గించుకోవాలని గ్రూప్ ఆఫ్ సెవెన్ (జీ7) దేశాలు శనివారం పిలుపునిచ్చాయి. పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని, సంక్షోభానికి వేగవంతమైన, శాశ్వత దౌత్య పరిష్కారానికి మద్దతు ఇస్తున్నామని జీ7 దేశాలు ప్రకటించాయి. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఘోరమైన ఉగ్రవాద దాడిని కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ విదేశాంగ మంత్రులు, యూరోపియన్ యూనియన్ ఉన్నత ప్రతినిధి ఒక సంయుక్త ప్రకటనలో తీవ్రంగా ఖండిరచారు. ఉద్రిక్తతలను నివారించాలని వారు రెండు దేశాలను కోరారు. "మరిన్ని సైనిక ఉద్రిక్తతలు ప్రాంతీయ స్థిరత్వానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తాయి. సరిహద్దుకు ఇరువైపులా పౌరుల భద్రత, శ్రేయస్సు గురించి మేం తీవ్ర ఆందోళన చెందుతున్నాం" అని పేర్కొన్నారు. ఉద్రిక్తతలను తక్షణమే తగ్గించాలని పిలుపు ఇస్తున్నట్లు వెల్లడిరచాయి. శాంతియుత, స్థిరమైన పరిష్కారాన్ని సాధించే లక్ష్యంతో భారత్, పాకిస్తాన్‌లు ప్రత్యక్ష సంభాషణలో పాల్గొనాలని ప్రోత్సహించింది.

జీ7 అనేది ప్రపంచంలోని ఏడు అత్యంత అభివృద్ధి చెందిన, పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థల అనధికారిక కూటమి. ఇందులో కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ ఉన్నాయి. యూరోపియన్ యూనియన్ కూడా జీ7 సమావేశాలలో పాల్గొంటుంది. కానీ ఏడుగురు సభ్యులలో ఒకటిగా దాన్ని లెక్కలోకి తీసుకోరు. ప్రధాన పారిశ్రామిక శక్తుల మధ్య ఆర్థిక విధానాన్ని చర్చించడానికి, సమన్వయం చేయడానికి జీ7 మొదట 1970లలో ఏర్పడిరది. భద్రత, వాతావరణ మార్పు, అభివృద్ధి, ఆరోగ్య సంక్షోభాలు, ఇప్పుడు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి ప్రపంచ సమస్యలను ఈ కూటమి పర్యవేక్షిస్తూ ఉంటుంది. దీనికి శాశ్వత కార్యాలయం, చట్టపరమైన అధికారం లేనప్పటికీ జీ7 దాని సభ్యుల రాజకీయ, ఆర్థిక శక్తి కారణంగా ప్రభావవంతమైనది.

## పంచాంగం

ఆదివారం 11-5-2025
శ్రీ విశ్వావసు నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, వసంత రుతువు
వైశాఖ మాసం

| | |
|---|---|
| తిథి | : శు. చతుర్దశి రా. 8.02 |
| నక్షత్రం | : స్వాతి పూర్తి |
| వర్జ్యం | : ప. 9.34 ల 11.22 |

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# కథల్లో నీతి, బొమ్మల్లో జీవితం - 'కాకులు దూరని కారడివి'







రాయలసీమ కవి , ఉపాధ్యాయులు జూటూరు తులసీదాసు గారు రచించిన కాకులు దూరని కారడివి.

ఇది పిల్లల కోసం మేలైన నీతి కథల సంకలనము.

ఈ పుస్తకం గురించి చెప్పుకోవాలంటే, ముఖ్యంగా ఇందులోని ప్రతి కథ అందమైన బొమ్మలతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది.

పిల్లలు ఈ పుస్తకానికి త్వరగా ఆకర్షితులవుతారు. కథలతోపాటు, అవి అందించే లోతైన సందేశాలను కవి జూటూరు తులసీదాసు గారు స్పష్టంగా వ్యక్తీకరించారు.

ఈ పుస్తకంలో మొత్తం 25 కథలు ఉన్నాయి. ప్రతీ కథ దాని ప్రత్యేకతను నిలుపుకుంటుంది.

చదివే పిల్లలకు ఇవి చాలా ఉపయోగకరంగా ఉంటాయి.

ఈ పుస్తకంలోని నాకు నచ్చిన కొన్ని కథలు మీతో పంచుకుంటున్నాను.

**రాజహంస:**

ఇది గొప్ప సందేశమిచ్చే కథ.

"తన స్థాయికి తగని చోట తాను ఉండరాదని భావించిన రాజహంస, వెంటనే అక్కడి నుంచి తిరుగు ప్రయాణం అయింది."

ఇక్కడ రాజహంస నైతికతను, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తుంది.

ఈ కథ మనకు కొన్ని ముఖ్యమైన పాఠాలను నేర్పిస్తుంది:

మనం ఉన్న స్థలం, మనం కలిసే వ్యక్తులు మన విలువలకు అనుగుణంగా ఉండాలి.

మనకు అనుకూలం కాని పరిస్థితుల నుంచి తొందరగా తప్పుకోవడం తెలివైన నిర్ణయం.

ఏ పరిస్థితిలోనైనా, మన నిజమైన విలువను కాపాడుకోవడం ముఖ్యం.

**కాకి:**

ఈ కథలో కాకి ఎంతో తెలివిగా, ధైర్యంగా వ్యవహరించి జాలరికి సహాయం చేసింది.

జాలరి ఒకప్పుడు తన పిల్లలను పిల్లి నుంచి కాపాడాడు.

ఆ కృతజ్ఞతగా, కాకి సమయానికి తన తెలివితో జాలరికి ఒడ్డుదారి చూపించి, ప్రాణాపాయం నుంచి బయటపడేలా చేసింది.

ఈ కథ మనకు కృతజ్ఞత అనే మహత్తరమైన గుణాన్ని నేర్పిస్తుంది.

ఇది ఒక ప్రేరణాత్మక గాథ.

మన జీవితంలో కూడా ఎవరైనా మనకు సహాయం చేస్తే,

మనకు అవకాశం వచ్చినప్పుడు వారికి సహాయం చేయడం మానవతా ధర్మం.

**అనగనగా ఒక తాబేలు:**

ఈ కథ ఒక మంచి నీతి కథగా చెప్పవచ్చు.

ఇందులో తాబేలు పాత్ర ద్వారా పట్టుదల, సహనం, క్రమశిక్షణ వంటి విలువైన గుణాలను స్పష్టంగా ప్రతిబింబించారు.

**ఈ కథలోని ప్రధాన సందేశం:**

"తొందరపడి చేసే పనులు ఎప్పుడూ విజయవంతం కావు, కానీ ఓర్పుతో, క్రమశిక్షణతో సాగితే విజయం ఖాయం."

ఇది పిల్లలకే కాకుండా పెద్దలకు కూడా విలువైన జీవనపాఠాన్ని నేర్పించే కథ.

ఈ పుస్తకంలోని కథలు సునిశితమైన నీతిని, గమనించదగ్గ సంఘటనల ద్వారా అందిస్తున్నాయి.

కథలలోని పాత్రలు (పక్షులు, జంతువులు, తాబేలు మొదలైనవి)

ప్రతీకాత్మకంగా మనుషుల నడవడిని, విలువలను ప్రతిబింబిస్తున్నాయి.

కథల శైలి సరళమైనది, పిల్లలకు అర్థమయ్యేలా ఉంది,

కాబట్టి ఇది వారి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది అని చెప్పడంలో సందేహం లేదు.

కవి జుట్టూరి తులసీదాసు గారు తమ వర్ణనాశైలితో,

పాత్రల మధ్య సంభాషణలను సహజంగా, ఆసక్తికరంగా మలిచారు.

మొత్తం మీద, ఈ పుస్తకంలోని కథలు బోధకంగా, సరళంగా, ఆకర్షణీయంగా ఉన్నాయి.

మీ రచనా శైలి పిల్లలకు సరళంగా అర్థమయ్యేలా ఉన్నప్పటికీ,

మరింత హృద్యమైన ప్రస్తావన, పాత్రల మధ్య ఎమోషనల్ కనెక్షన్ ఉంటే,

కథలు మరింత ప్రభావవంతంగా మారతాయి.

సహజమైన సంభాషణలు, చిన్న చిన్న హాస్యభరిత ఘట్టాలు జోడిస్తే, కథలు మరింత ఆకర్షణీయంగా మారతాయి.

ఇది కేవలం నా అభిప్రాయం మాత్రమే.

కవి జూటూరు తులసీదాస్ గారు మరెన్నో పుస్తకాలను తీసుకురావాలని, బాల సాహిత్యంలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని నిలుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

ఈ పుస్తకం కావాలి అనుకున్న వాళ్లు జూటూరు తులసి దాస్ గారిని సంప్రదించగలరు.

**- జ్యోతి మువ్వల**
**9008083344**

## గొడుగు

నాదిప్పటికీ ప్రశ్నే
నేను వర్షానికా
లేకజీ
ఎండకా...
ప్రపంచంలో
మొదటి గొడుగు చెట్టు కొమ్మలేనట....
చరిత్ర మాటల బట్టీ
ఎండలో నీడనివ్వడానికి
రూపుదిద్దుకున్నవాడినిజి
ఆదిలో నేను
రాజులకు మాత్రమే పరిమితమైన
ఓ గొప్ప వస్తువుగా పరిచయమయ్యాను
చైనీయులు
తొలుతగా మొదటి గొడుగును
ఓ క్రమంలో తయారుచేశారట
ఇటలీ దేశస్తులు నన్నో అలంకార వస్తువుగా
రూపొందించారు...
ఏడు వందల సంవత్సరాల క్రితం
నీటిని పీల్చేసే ఓ పరికరంగా నన్ను వానకు సైతం
ఉపయోగించడం మొదలుపెట్టారు.
నామీద రకరకాల బొమ్మలు ముద్రిస్తారు
కొత్త కొత్త వర్ణాలు
కొత్త కొత్త డిజైన్లు
నన్ను మహిళలకు చేరువ చేస్తుంటుంది.

మనుషుల అభిరుచులతోపాటు
గుణాలను గొడుగులు వెల్లడిస్తాయి.

ఓ గొడుగులో ప్రియులిద్దరు
కలిసి అడుగులు వేయడానికి తోడ్పడే నేను
సముద్రతీరపు ఇసుకతిన్నెలపై
నా చాటుమాటున సరసాలాడుకోవడానికి
ముందువెనుకలు ఆలోచించరు.

వయోధికుల మూడో కాలుగానూ
నేను పనికొస్తాను.

చిన్నపాటి జల్లులు మొదలయ్యాయో లేదో
గొడుగులు తీస్తారు
ఆకాశం నుంచి నేలను ముద్దాడడానికి
పడే వానజల్లులను నాతో అడ్డుకునే వారంటే
నాకు కొంత కోపమే...
దేవుడి మొదలుకుని ప్రేమికుల వరకూ
రాజుల నుంచి మహిళల వరకూ
నా చేయి పట్టుకున్నా
రోడ్డుపక్కన పరచిన చిరిగిన గొడుగులో
పడుకున్న వారిని చూసినప్పుడు
నా పుట్టుకేంటో బోధపడుతుంది
చాలా మందికి నేను గొడుగును
కొందరికి నేను గూడుని
నన్ను విప్పి మళ్ళీ తపీమని మడిచిపెట్టేటప్పుడల్లా
నాలోపలి కమ్మీలన్నీ ఎంత నలిగిపోతాయో
తెలుసుకోండి
నన్ను మెల్లగా వాడటానికి ప్రయత్నించండి

**- యామిజాల జగదీశ్**

# భయపడమనడం లేదు

## బాధ్యతపడమంటున్నది ప్రభుత్వం







ఉగ్రవాదం దేశం మీద యుద్ధం ఇవి కేవలం బీజేపీ సమస్యలు కావు దేశం సమస్యలు మొత్తం భారతీయుల సమస్యలు వాడు గనుక పైచేయి సాధిస్తే మనం ఏ దురవస్థల్లోకి పోవాల్సి ఉంటుందో ఒక్కసారి ఊహించండి.

కానీ మన దేశంలో మేధావులుగా, పాత్రికేయులుగా, చైతన్యవంతులుగా చెప్పుకోవబడే కొందరున్నారు. పేరుకు మాత్రమే కీలకమైన యుద్ధ సందర్భంలో ఎంత సంయమనం పాటించాలో తెలియడం లేదు. తమ వికృత కోణాన్ని పదే పదే ఆవిష్కరిస్తున్నారు.

శత్రుదేశం దాడులను కూడా బీజేపీ కోణంలో చూస్తూ దేశం మీద విషాన్ని చిమ్ముతున్నారు. ది వైర్ సైటును బ్లాక్ చేయడం మీద ఓ గగ్గోలు అదేమంటే ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ అది ఇచ్చింది ఎవరు మన రాజ్యాంగం మరి వాడు మన దేశాన్ని కబళించే ప్రయత్నంలో ఉంటే అత్యయిక పరిస్థితి అనధికారికంగా మన చుట్టూ అలుముకుని ఉంటే మన టోటల్ ఫ్రీడమే ప్రమాదంలో ఉంటే ఈ ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ అనే మాటను పదే పదే వల్లెవేయడం, తమ నెగెటివ్ క్యాంపెయిన్‌ను జస్టిఫై చేసుకోవడం అన్యాయం కాదా..? ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్‌కు కూడా పరిమితులుంటయ్,.. ఉండాలి. ఎందుకంటే, ఇది యుద్ధం కాబట్టి..!

8000 ఎక్స్ ఖాతాల్ని స్తంభింప చేయాలని కేంద్ర ప్రభుత్వం ఎక్స్ (పాత ట్విట్టర్)ను అడిగింది. తప్పదు అని చెప్పింది. లేకపోతే ఏమిటో వాడికీ తెలుసు కదా. ఏడుస్తూనే వాటిని నిలిపివేస్తున్నట్టు చెప్పింది ఎక్స్ అంతేకాదు, బాధ్యత లేకుండా ఏదిపడితే అది రాస్తే చర్యలు తప్పవు అని హెచ్చరించింది అవసరం.

ఫ్రంట్ లైన్ ఎడిటర్ వైష్ణారాయ్ ఎక్స్‌లో ఎలాంటి చిల్లర పోస్టులు పెడుతుందో గమనిస్తున్నాం కదా. సరే, రాజ్ మదిరాజు వాల్ మీద ఓ ఆసక్తికరమైన పోస్టు కనిపించింది. (కొంచెం పెద్ద పోస్టు.. ఓపికుంటే చదవండి..)

కొంతమంది మేధావులు చాలా మిస్-గైడెడ్ లక్ష్యాలు, ఆలోచనలతో పనిచేస్తారు.. వీళ్ళు వాడుకునే షీల్డ్ ఏంటి.. ఫ్రీడం ఆఫ్ ఎక్స్‌ప్రెషన్..

ప్రవీణ్ సాహనీ అనే రిటర్డ్ మిలిటరీ (ఆర్మీలో అతనేం చేశాడో క్లియర్‌గా లేదు) ఆఫీసరు ఇప్పుడు జర్నలిస్టుగా మారి "ఫోర్స్" అన్న మేగజైన్ మొదలుపెట్టాడు.. కాశ్మీరు సపరేటిస్టు వాదనలను సటిల్‌గా సమర్ధించే ఘజలా వహబ్ అన్న మరో జర్నలిస్టుతో కలిసి..

ఈయన కొన్ని పుస్తకాలు, ఆర్టికిల్స్ రాశాడు, మరికొన్ని వీడియోలు తీశాడు..

అందులో ఒకటి.. "కాశ్మీరు ఎన్నికలు- ఒక ఫ్రాడు" అన్న పుస్తకం రాసిన నాజిర్ కమల్ అనే పాకిస్తానీ రైటరుతో కలిసి "ఇండియా, పాకిస్తాన్లమధ్య మిసైల్స్ ఇంపరేటివ్" అన్న ఒక మోనోలాగ్..

కొన్నాళ్ళక్రితం ఈయన ఒక పాకిస్తానీ చానెల్‌కి ఇచ్చిన ఇన్‌టర్వ్యూలో చాలా కేటగారికల్‌గా చెప్పాడు.. పాకిస్తాన్ ఇప్పటివరకూ ఇండియాతో ఒక్క యుద్ధం కూడా ఓడిపోలేదు అని..

మరో వీడియోలో పాకిస్తాను ఇండియాకి ఓవర్‌మ్యాచి అని.. అంటే మనకన్నా బలవంతులు అన్నది అతని అంచనా..

ఇహ చైనా అనగానే భయంతో వొణికిపోతూ యుద్ధమన్న మాట ఎత్తద్దని వాళ్ళను కొనియాడతాడు..

అతని ఇంటర్వ్యూలు, వీడియోల కింద చప్పట్లు కొట్టేది ఎక్కువమంది పాకిస్తానీయులే.. మిగిలిన కొద్దిమంది ఇండియన్లెవరనేది మీకూ దాదాపుగా తెలుసు..

ఆపరేషన్ సిందూర్ జరిగిన రాత్రి ఇండియా టుడేలో జర్నలిస్టు అన్న ఒక మాటను, పేరు తెలీని ఒక ఫ్రెంచి ఎక్స్‌పర్టు అన్న మరో మాటను పట్టుకుని, ఐయేయేఫ్ విమానాలు నాలుగింటిని పాకిస్తాను కూల్చేసిందన్న థియరీని సమర్ధిస్తూ ప్రవీణ్ సాహనీ ఒక పదకొండు నిముషాల వీడియో పోస్ట్ చేశాడు.. కొద్దిసేపటికి ఆ వీడియోని ఇండియన్ ప్రభుత్వం బ్యాన్ చేసింది..

కారణం చెప్పలేదు.. చెప్పాల్సిన అవసరం కనబడలేదు.. ఏది సరైన ఇన్‌ఫర్మేషనో, ఏది మిస్-ఇన్‌ఫర్మేషనో సరిగ్గా తెలీకుండా ఎవరికి తోచిన వాదనలు, థియరీలు యుద్ధం మధ్యలో చెప్పుకుంటూ పోతే ఉత్పన్నమయ్యే కన్ఫ్యూజన్ గురించి ఈ సో-కాల్డ్ డిఫెన్స్ ఎక్స్‌పర్టుకి కారణం కూడా చెప్పాలా.. ముఖ్యంగా ఇంటర్నేషనల్ ఎరీనాలో..

అయితే సరిగ్గా ఇలాంటి అవకాశాల కోసం గోతికాడ నక్కలా కాచుక్కూర్చునే జర్నలిస్టు మరొకడున్నాడు.. కరణ్ థాపర్ అని, వైర్ మేగజైను.. ఇతని లీలలు ఇన్నని పేర్కొనలేము.. అసలితను ప్రశ్నలడిగే తీరులోనే నక్కతనం బయటపడుతూ ఉంటుంది..

మూడు రోజులక్రితం సీబీఇ వలలో చిక్కుకుని మోదీకి వ్యతిరేకంగా కడుపుమంట, అజీర్తితో విరుచుకుపడుతున్న సత్యపాల్ మాలిక్ అనే నాయకుడితో ఒక ఇంటర్వ్యూ చేశాడు థాపరు..

**ది వైర్...**

అందులో సత్యపాల్ "మోదీ సిగ్గులేనివాడని, ఇంకా అసభ్యమైన పదజాలంతో దూషిస్తూ రెండువారాలైనా ఇంకా పాకిస్తానుపై ఎటాక్ చేయకుండా పిరికివాడిలా దాక్కున్నాడని కాస్సేపు ఇద్దరూ కడుపు మంట చల్లార్చుకుని నవ్వుకున్నారు..

సరిగ్గా అదేరోజు రాత్రి ఆపరేషన్ సిందూర్ మొదలైంది.. క్షిపణి వీళ్ల మీదే పడ్డట్టుగా అనిపించిందేమో, సైలెంటయ్యారు..

అయితే లేటెస్టుగా ఈరోజు ప్రవీణ్ సాహనీ ఇందాక చెప్పుకున్న వీడియోని ప్రభుత్వం తీసేయగానే గుంటనక్క కరణ్ థాపర్ అర్జంటుగా అతన్ని పిలిచి చాలా బాధగా ఇంటర్వ్యూ చేశాడు.. ఎందుకిలా జరిగింది అని..

తన వీడియోలో చెప్పుకున్న థియరీలన్నీ మళ్ళీ చెప్పుకున్నాడు ప్రవీణ్ సాహనీ.. అది బైటికి రాగానే "వైర్" మేగజైను మరి పనిచేయుట మానేసింది.

ఇప్పుడు కామ్రేడ్లందరూ కలిసి ప్రభుత్వం బ్యాన్ చేసిందని, ఫ్రీడమ్మాఫెక్స్‌ప్రెషన్ అంటూ గగ్గోలు మోడ్‌లో ఉన్నారు..

బ్రదర్.. యుద్ధం జరుగుతోంది, ప్రభుత్వం ఒక స్ట్రాటజీతో పనిచేస్తుంది.. నీ చిట్టిబుర్రకు తట్టినవన్నీ నిజాలుగా భావించి రాస్తూ పోతే మన సైన్యాన్ని మనమే నిర్వీర్యం చేసినవాళ్లమవుతాం..

సో, కొన్నాళ్ళపాటు ఈ ప్రభుత్వం విడుదల చేసిన మాటలనే మీరూ చెబ్తూ వెళ్ళండి.. మీవల్ల అవట్లేదా, గుండె మూసుక్కూర్చోండి..

భయపడమనడం లేదు.. బాధ్యతపడమంటున్నాను.. నువ్వుంటోంది ఇండియా అని గుర్తించమంటున్నాను.. అంతే..

నీలాంటివాళ్ళ వీడియోలు చూసే పాపం ఆళ్ళ డిఫెన్స్ మినిస్టరు చూడు, "ఇట్సాలోవర్ సోషల్ మీడియా.." అంటున్నాడు.. తప్పు కదా..

ప్రధానమంత్రిని నిర్ద్వందంగా విమర్శించే ఒవైసీ ఎంత చక్కగా సమర్ధిస్తున్నాడు.. మీకేం పోయేకాలమొచ్చింది అని అడిగే లోపలే పోయిపారేశారు.. అదీ మ్యాటరు..

**(ముచ్చట వెబ్ సైట్ నుంచి)**

## చరిత్రలో ఈ రోజు (మే 11)

**సంఘటనలు:**

1502 : కొలంబస్ ఇండీస్ దీవులకు తన చివరి (నాలుగవ) యాత్రను మొదలుపెట్టాడు.

1751 : మొదటి అమెరికన్ ఆసుపత్రిని స్థాపించారు (పెన్సిల్వేనియా హాస్పిటల్)

1752 : మొదటి అగ్నిప్రమాద భీమా పథకాన్ని అమెరికాలో మొదలు పెట్టారు (ఫిలడెల్ఫియా)

1772 : ఆమ్‌స్టర్‌డాం థియేటర్ (రంగశాల) అగ్నిప్రమాదంలో తగులబడి, 18 మంది మరణించారు.

1784 : టిప్పు సుల్తాను ఇంగ్లాండుతో మైసూరు శాంతి ఒప్పందం చేసుకున్నాడు.

1792 : అమెరికన్ కెప్టెన్ రాబర్ట్ గ్రే, కొలంబియా నదిని కనుగొని, దానికి కొలంబియా అని పేరు పెట్టారు.

1816 : అమెరికన్ బైబిల్ సొసైటీని స్థాపించారు (న్యూయార్క్ లో).

1833 : లేడీ ఆఫ్ ది లేక్ అనే నౌక మంచుఖండాన్ని (ఐస్‌బెర్గ్), ఉత్తర అట్లాంటిక్ సముద్రంలో మునిగిపోయింది. 215 మంది మరణించారు.

1850: మొదటి సారిగా ఇటుకలతో భవనాలు కట్టడం శాన్ ఫ్రాన్సిస్కో నగరంలో మొదల్కొంది.

1858 : మిన్నసోటా రాష్ట్రం, 32వ రాష్టంగా అమెరికాలో చేరింది.

1893 : హెన్రీ డెస్‌గ్రేంజ్ మొదటి ప్రపంచ సైకిల్ రికార్డుని స్థాపించాడు (35.325 కి.మీ)

1916 : ఐన్‌స్టీన్ తన సాపేక్ష సిద్ధాంతం వెల్లడిరచాడు. (థియరీ ఆఫ్ జనరల్ రెలెటివిటీ).

1921 : టెల్ అవివ్ మొట్టమొదటి యూదుల మునిసిపాలిటీ (నేటి ఇజ్రాయిల్ రాజధాని).

1928: జనరల్ ఎలెక్ట్రిక్ కంపెనీ మొదటి టెలివిజన్ కేంద్రాన్ని (టి.వి.స్టేషను) ని మొదలు పెట్టింది (న్యూయార్క్ లోని షెనెక్టాడీ లో).

1929: రోజువారీ టెలివిజన్ ప్రసారాలు మొదటిసారిగా ప్రసారమయ్యాయి (వారానికి 3 రాత్రులు).

1949: మొదటి పోలరాయిడ్ కెమెరాని 89.95 అమెరికన్ డాలర్లకు న్యూయార్క్ లో అమ్మారు.

1949: ఇజ్రాయిల్ 37-12 ఓట్లతో, 59వ సభ్యదేశంగా, యునైటెడ్ నేషన్స్ లో చేరింది.

1949: సియాం (సయాం) దేశం తన పేరుని థాయ్‌లాండ్గా మార్చుకున్నది.

1955: ఇజ్రాయిల్ గాజా మీద దాడి చేసింది.

1958: అమెరికా బికినీ దీవి లో, వాతావరణంలో, అణుబాంబుని పేల్చి, ఆ అణుబాంబు శక్తి, సామర్ధ్యాలని పరీక్షించింది.

1961: హైదరాబాదులో రవీంద్ర భారతి కళావేదిక ప్రారంభం.

1962:అమెరికా క్రిస్టమస్ దీవి లో, వాతావరణంలో, అణుబాంబుని పేల్చి, ఆ అణుబాంబు శక్తి, సామర్ధ్యాలని పరీక్షించింది.

1965: భారతదేశంలో, 1965 లో, ఒక్క నెలలోపే వచ్చిన 2 తుఫానులలో, మొదటి తుఫానుకి 35,000 మంది మరణించారు.

1967: అమెరికాలో, 10వ కోటి టెలిఫోన్ ను కనెక్ట్ చేసారు (10 కోట్ల టెలిఫోన్లు).

## శ్రీ నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న
## 'ఓ భామ అయ్యో రామ' చిత్ర దర్శకులు రామ్ గోదల



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):–** ఉత్తరాంధ్ర ప్రజలఇలవేలుపు శ్రీ నూకంబిక అమ్మవారిని దర్శించుకున్న చలనచిత్ర దర్శకులు రామ్ గొదల తెరకెక్కించిన సుహస్ హీరో గా, మాళవిక మనోజ్ హీరోని గా "ఓ బామ అయ్యో రామ" చిత్రం జూన్ నెలలో విడుదలవుతున్న సందర్భంలో అనకాపల్లి విచ్చేసి ముందుగా అమ్మవారి దర్శించుకొని మొక్కు చెల్లించుకొని పూజలు నిర్వహించుకున్నారు.

అనంతరం ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖచిత్రం మూవీ డైరెక్టర్ గంగాధర్, శ్రీ బ్రాహ్మిత్, మరియు ఆలయ ధర్మకర్త పొలిమేర ఆనంద్, ఎస్ భానుచందర్ (అఖి), హేమంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు పోలీసులకు సహకరించాలి
### డీఎస్పీ విష్ణు స్వరూప్



**పరవాడ, (విశాఖ సమాచారమ్):–** మండల కేంద్రమైన పరవాడ లో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా డిఎస్పి విష్ణు స్వరూప్ , గ్రామ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, సీఐ ఆర్. మల్లికార్జున రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై విశ్వాసాన్ని పెంపొందించేందుకు, నేరాల నివారణపై అవగాహన కల్పించేందుకు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ప్రజలు పోలీసులకు సహకరించాలని, అపరిచితులపై నిఘా పెట్టి, వారి వివరాలు తీసుకొని అద్దెకు ఇల్లు ఇవ్వరాదని సూచించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఈ నెలాఖరు లోగా నాలుగు ముఖ్య కూడళ్లలో అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు., స్థానిక వ్యాపారస్తులు మరియు ఇంటి యజమానులు తమ షాపులు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డి.ఎస్.పి తెలిపారు.

ప్రతి షాపులో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని వివరించారు.

బెట్టింగ్ యాప్స్ ప్రభావానికి గురికాకుండా పిల్లలను కాపాడాలని, తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు.గంజాయి, మత్తు పదార్థాల వినియోగం నుండి యువతను దూరంగా ఉంచాలని హెచ్చరించారు.సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి, ముఖ్యంగా అపరిచితుల ఫోన్లు, ఓటిపి మోసాల విషయంలో జాగ్రత్త వహించాలి.మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు బాధ్యతతో వ్యవహరించాలి.

ఏ సమయంలోనైనా అనుమానం కలిగినపుడు పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని అన్నారు.

రాత్రి గస్తీ నిర్వహణలో భాగంగా వ్యాపారస్తుల భాగస్వామ్యంతో ఉత్సాహ వంతులను నియమించాలన్న ప్రతిపాదన చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణారావు , పంచాయతీ కార్యదర్శి ఆర్. మురళీధర్ పట్నాయక్ , వార్డు సభ్యులు పోతల అప్పలనాయుడు , పైల అప్పలనాయుడు సత్యవేణి , రైతు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ , టిడిపి అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు , వర్తక సంఘ సభ్యులు, వ్యాపారస్తులు ప్రజలు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త ఆటోబంద్ ను జయప్రదం చెయ్యండి




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** జగదాంబ సిఐటియు ఆఫీసులో ఆటో రిక్షా కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రెస్మీట్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది.

ముఖ్య వత్తుగా సిఐటియు ప్రధాన కార్య దర్శి ఆర్కే ఎస్ వి కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఇప్పటి వరకు జరిగిన సమ్మెలకు ఇప్పుడు జరుగుతున్న ఈ సమ్మె (మే-20)కు చాలా వ్యత్యాసం ఉంది.16 డిమాండ్లలో అన్నింటకన్నా ముఖ్యమైనది లేబర్‌కోడ్‌లను రద్దు చేయడం. లేబర్‌కోడ్‌లు అమలులోకి వస్తే చట్టాలు వర్తించే కార్మి కులు, చట్టాలువర్తించని (షెడ్యూల్, నాన్ షెడ్యూల్) కార్మికులు అందరూ బానిసత్వం లోకి నెట్టబడతారు. వీటితో పాటు ఆటో కార్మికులకు ఉరితాడు వంటి మోటారు ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం 2019ను రద్దు చేయాలని పెంచిన చలానా చార్జీలు తగ్గించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ 11 కేంద్ర కార్మిక సంఘాలు మే 20వ తేదీన ఆటోబంద్‌కు పిలుపు ఇచ్చాయి. కార్మికులందరూ ఈ బంద్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

లేబర్‌కోడ్‌లు అమలులోకి వస్తే సంఘం పెట్టుకునే హక్కు పోతుంది. అన్నింటికంటే ప్రమాదకరమైంది లేబర్‌కోడ్‌లో సమ్మె హక్కును కాజేయడం. యూనియన్ రిజిస్ట్రే షన్, గుర్తింపు రెండూ రద్దుచేయవచ్చు. లక్షలు జరిమానా విధించవచ్చు.

కాని ఇప్పటి వరకూ యజమానులు పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్ చెల్లించని వారికి జైలుశిక్ష ఉండేది, దానికి భయపడి కట్టేవారు. బెయిల్ రావాలంటే కూడా 50% చెల్లించాలి. కాని లేబర్ కోడ్‌లో యజమాను లపై ఈ శిక్షలన్నీ ఎత్తివేశారు. ఇవే కాకుండా ఇతర కార్మిక చట్టాలు, క్రిమినల్ చట్టాల్లో వున్న 180 రకాలు శిక్షలు ఎత్తివేస్తూ కేంద్ర ప్రభుత్వం 'జన విశ్వాస్' అనే చట్టంచేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు తనిఖీలు పద్ధతిని ఎత్తివేశారు. తనిఖీలు లేకుండా ఏ చట్టం అమలుకాదు. లేబర్‌కోడ్‌లు కంపెనీలు మూసివేయడం, లాకౌట్‌చేయడం, లేఆఫ్ చేయడానికి పాం ప్లమెంట్ లోనే మార్చాలి. కాని లేబర్‌కోడ్‌ల ద్వారా రాష్ట్రాలకు ఇష్టంవచ్చినట్లు మార్చే అధికారాలొచ్చాయి.రాష్ట్రంలో లేబర్‌కోడ్‌లు రాకుండానే చంద్రబాబునాయుడు ప్రభుత్వం 'స్పీడ్ఆఫ్ డూయింగ్' అమలు చేస్తున్నది. సంవత్సరాల నుంచి ప్రభుత్వాలు కనీస వేతనాలు రూపాయి కూడా పెంచలేదు. లేబర్‌కోడ్‌లు వస్తే ఇప్పుడున్న అన్ని చట్టాలు పోయినట్లే.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల వలన ఆటో రంగం తీవ్ర సంక్షోభంలో ఉంది. చలానా చార్జీలు, థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్, పెట్రోల్, డీజిల్ చార్జీలు విపరీతంగా పెంచారు. రాష్ట్రంలో జిఓ నెం.21 పేరుతో ఆటో, ట్యాక్సీ, లారీ లపై భారాలు వేశారు. ఎన్నికల ముందు లోకేష్ గారు ప్రతి స్టాండ్‌కి వచ్చి ఇచ్చిన హామీ ప్రకారం కార్మికుల్ని ఆదుకోవటానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు గురించి పట్టించుకోవటంలేదు. ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి కార్పొరేట్ కంపెనీలకు రవాణా రంగం అనుమతి ఇవ్వడంతో ఆటో, ట్యాక్సీ రంగంలో ఉపాధి పొందుతున్న వారి జీవితాలు దిన దిన గండంగా మారాయి. పనిగంటలు, కనీస వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్, ప్రమాదబీమా, రెస్ట్ రూమ్‌లు వంటి కనీస వసతులు లేవు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన స్పందన లేని పరిస్థితుల్లో 11 కేంద్ర కార్మిక సంఘాలు మే 20 వ తేదీన ఇచ్చిన సమ్మె పిలుపులో ఆటో, ట్యాక్సీ, డ్రైవర్ కం ఓనర్లు అందరూ పాల్గొని జయప్రదం చెయ్యవల్సిందిగా కోరారు.

## కలాం మాటలు కదిలించాయి



**గాజువాక, (విశాఖ సమాచారమ్):–** ప్రతి ఒక్కరూ కనీసం 10 మంది పేదలను చదివించండి.. విద్యాదానం ఎంతో గొప్పది.. అందరూ విద్యావంతులైతే సమాజంలో అసమానతలు తొలగిపోతాయని' ఢిల్లీలోని ఎర్రకోట వేదికగా 2003లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కాలం చెప్పిన మాటలు అమృతవాక్కులుగా భావించారు నగరంలోని ట్వింకిల్ కిడ్స్ పాఠశాల డైరెక్టర్ దొడ్డి శ్యామ్. తన పాఠశాలలో ఆ ఏడాది నుంచే దీనికి శ్రీకారం చుట్టారు. శ్యామ్ ప్రయత్నాన్ని అబ్దుల్ కలాం ఓసారి ఆయన పాఠశాలకు స్వయంగా వచ్చి అభినందించటం విశేషం.

గాజువాక 70వ వార్డు శ్రీనివాసనగర్‌లో దొడ్డి శ్యామ్ ట్వింకిల్ కిడ్స్ పాఠశాల నిర్వహిస్తున్నారు. మాజీ రాష్ట్రపతి కలాం అంటే ఇష్టం. పది మంది పేద పిల్లలకు విద్యాదానం చేయాలన్న కలాం మాటలను విన్న ఆయన 2003 జూన్‌లో 'ట్వింకిల్ ఉచిత విద్యా పథకాన్ని ప్రారంభించారు. ఇప్పటి వరకు 88 మంది విద్యార్థులు ఉచిత చదువు పూర్తిచేసుకొని వెళ్లిపోగా.. 64 మంది ప్రస్తుతం చదువుతున్నారు. వీరిలో 32 మంది తండ్రి లేని పిల్లల ఉన్నారు. ఏటా ఆ విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పుస్తకాలు, అవసరమైన స్టడీ మెటీరియల్ ట్వింకిల్ యాజమాన్యమే అందిస్తుంది.

**అవకాశం అందిపుచ్చుకొని..**

2024 పదో తరగతి పరీక్షల్లో 591 మార్కులు సాధించిన పెంటకోట హైందవి నర్సరీ నుంచి పది వరకూ ఉచిత విద్య పథకంలోనే కొనసాగింది. ఆ బాలిక ఈ ఏడాది ఇంటర్‌లో బైపీసీలో 440 మార్కులకుగానూ 435 తెచ్చుకుని రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది. ఈసారి 'పది'లో పాతర్లపల్లి జయషర్మిల 590 మార్కులు తెచ్చుకుని మట్టిలో మాణిక్యమై మెరిసింది.

**పాఠశాలలో క్లినిక్ నిర్వహణ..**

అలాగే ఈ పాఠశాల యాజమాన్యం 2012 ఫిబ్రవరి 2 నుంచి 2018 ఫిబ్రవరి 10వరకూ ఉచితంగా పాఠశాల ఆవరణలోనే క్లినిక్ నిర్వహించింది. ఒక నిపుణుడైన వైద్యుడు, ఒక నర్సును నియమించి వార్డులోని కొండప్రాంత పేదలకు ఉచిత వైద్యమందించింది. కలాం జ్ఞాపకార్థం శ్రీనివాసనగర్‌లో ఆయన నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

**ఉచిత విద్యాపథకం బోర్డు**

**మట్టిలో మాణిక్యాలు..**

ఉచిత విద్యా పథకం ద్వారా ఈ పాఠశాల నుంచి చదువులు పూర్తి చేసి వెళ్లిన అనేకమంది వివిధ ఉద్యోగ రంగాలలో స్థిరపడ్డారు. మట్టిలో మాణిక్యాలు మెరుగులు దిద్దుకుని రాణించడం అందరిలోనూ స్ఫూర్తిని నింపుతోంది.

**కలాం స్వయంగా వచ్చే..**

తన మాటకు విలువనిచ్చి ఉచిత విద్యాభ్యాసం అందిస్తున్న ట్వింకిల్ కిడ్స్ పాఠశాలకు 2010 ఆగస్టు 14న మాజీ రాష్ట్రపతి హోదాలో అబ్దుల్ కలాం స్వయంగా విచ్చేశారు. ఓ గంటసేపు విద్యార్థులతో గడిపారు. పాఠశాల డైరెక్టర్ శ్యామ్, ప్రిన్సిపల్ కరుణకుమారిని అభినందించారు.

## తెలుగు బిడ్డ మురళి నాయక్ వీరమరణం దిగ్భ్రాంతికి గురిచేసింది : రత్నాకర్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):–** పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో మన తెలుగు బిడ్డ మురళీ నాయక్ వీర మరణం పొందడం తీవ్ర వేదనను కలిగించిందని విదేశీ పర్యటనలో ఉన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ తెలియజేశారు. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా జమ్మూ కాశ్మీర్ యుద్ధభూమిలో పాకిస్తాన్ సైనికుల తో విరోచితంగా పోరాడుతూ మన తెలుగు బిడ్డ సత్యసాయి జిల్లా కల్లితండాకు చెందిన జవాను మురళీ నాయక్ వీర మరణం పొందడం పట్ల రత్నాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు విడిచిన మురళీ నాయక్ వీర మరణం తెలుగు ప్రజలకే కాక దేశ ప్రజలందరికీ స్ఫూర్తి దాయకం అని పేర్కొన్నారు.పాకిస్తాన్ తో యుద్ధంలో మురళీ నాయక్ ప్రదర్శించిన ధైర్య సాహసాలకు మన తెలుగు రాష్ట్రాల తరఫున జేజేలు పలికారు.మురళీ నాయక్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుణ్ని ప్రార్థిస్తు వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా మురళీ నాయక్ కుటుంబాన్ని ఆదుకుంటాయని తెలియజేసారు.

## వీరగాథల చరిత.. త్యాగధనుల ఘనత




**కాకినాడ, (విశాఖ సమాచారమ్):–** స్వరాజ్య సమరంలో వీరోచిత పోరాటం చేసిన గడ్డ ఇది.. ఎందరో త్యాగధనుల స్ఫూర్తితోనే స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నాం. భారత్– పాక్ సరిహద్దుల్లో భీకర పోరు జరుగుతున్న వేళ దేశమంతా మన సైనికులకు మద్దతు పలుకుతోంది. దేశ రక్షణలో సేవలందిస్తున్నవారు.. సేవల నుంచి నిష్క్రమించిన మాజీలు వేలాదిగా తూర్పు తీరాన ఉన్నారు. మన జిల్లాకు చెందిన అనేకమంది యుద్ధవీరులు కదనరంగంలో అసువులు బాశారు. వీరి స్ఫూర్తి అణువణువునా ఇంకిన వేళ దేశం కోసం మేము సైతం నినాదం ముక్త కంఠంతో వినిపిస్తోంది.

**త్రివిధ దళాల్లో.. తూర్పు వీరులు**

**అమర వీరులు**

భారత్– పాకిస్థాన్, భారత్– చైనా యుద్ధాలతోపాటు.. ఆపరేషన్ విజయ్ (కార్గిల్), పరాక్రమ్, మేఘదూత్, పావన్, రక్షక్ యుద్ధాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన వీరులు పోరాడారు. 16 మంది వీర సైనికుల గౌరవార్థం కాకినాడలోని సైనిక్ భవన్ వద్ద 'వాల్ ఆఫ్ వార్ హీరోస్' పేరుతో నామఫలకం ఉంది. ప్రాణాలర్పించిన వీరుల వివరాలు పొందుపరిచి..అక్కడో తుపాకీని ప్రతిష్టించారు.

**భారత్– చైనా యుద్ధం..**

మద్రాస్ రెజిమెంట్‌లో పనిచేసిన ఉమ్మడి జిల్లాకు చెందిన సిపాయి పొడి భీమయ్య భారత్– చైనా యుద్ధంలో 1962 నవంబర్ 20న వీర మరణం పొందారు.

**భారత్– పాక్ సమరం..**

భారత్-పాకిస్థాన్‌ల మధ్య జరిగిన యుద్ధంలో ఇండియన్ ఆర్మీలో కార్యనిర్వాహక, సమాచార నిర్వహణ శాఖలో పనిచేసిన నందవరపు వెంకన్న 1965 సెప్టెంబర్ 12న ప్రాణాలు విడిచారు. మద్రాస్ రెజిమెంట్‌లో సైనికుడైన కుసుమ సహదేవుడు అక్టోబర్ 1న ప్రాణాలు కోల్పోయారు.

1971 డిసెంబరు 5న రక్షణ దళంలోని ఆర్టిల్లరీ రికార్డ్‌లో పనిచేసిన గవరసాని సూర్యారావు, 9న మద్రాస్ ఇంజినీర్స్ విభాగంలో పనిచేస్తున్న కొప్పిశెట్టి భాస్కరరావు వీరమరణం పొందారు. 11న గన్నర్ కుసుమపూడి సత్యనారాయణరాజు, 13న మద్రాస్ రెజిమెంట్‌లో సిపాయి కొల్లి జాన్ క్రిస్టోఫర్ (వీరచక్ర), 17న నాయక్ గుడాల చిన్నఅప్పారావు, 18న సిపాయి సాగరపు తాతబ్బాయి వీర మరణం పొందారు.

**కార్గిల్ పోరు..**

భారత వాయుసేనలో సార్జంట్‌గా పనిచేసిన పీవీఎన్ రవిప్రసాద్ కార్గిల్ యుద్ధం (ఆపరేషన్ విజయ్)లో 1999 మే 28న వీర మరణం పొందారు.

ఆర్మీ సర్వీస్ క్రాప్స్ (ఏఎస్‌సీ)లో విధులు నిర్వహిస్తున్న సైనికుడు నాగేంద్రబాబు ఆపరేషన్ పరాక్రమ్‌లో 2002 ఫిబ్రవరి 15న చనిపోయారు.

ఆపరేషన్ రక్షక్‌లో చొల్లంగి రామకృష్ణ 2008 మే 11న.. ఆపరేషన్ మేఘదూత్‌లో మద్రాస్ రెజిమెంట్‌లో ఎం.నాయక్ హోదాలో ఉన్న సాగరపు శ్రీనివాసరావు 2004 జనవరి 23న చనిపోయారు.

ఆపరేషన్ స్నో లియోపార్డ్‌లో 2023 జులై 28న మద్రాస్ రెజిమెంట్ హవల్దార్ పిట్ట శ్రీనివాసు ప్రాణాలు విడిచారు.

**శ్రీలంక యుద్ధం..**

శ్రీలంకలోని తమిళ్ టైగర్స్ (ఎల్‌టీటీఈ)ని నియంత్రించే క్రమంలో నిర్వహించిన ఆపరేషన్ పావన్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన లాన్స్ నాయక్ హోదాలో ఉన్న బి.జాన్‌బాబు 1987 సెప్టెంబర్ 1న ప్రాణాలు విడిచారు. మద్రాస్ ఇంజినీర్స్‌లో నాయక్ హోదాలో ఉన్న కొయ్య సుబ్బారావు 1989 మే 13న మృత్యువాత పడ్డారు.

## విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

## డి.ఎస్సీ- కరంట్ అఫైర్స్

### బ్రిక్స్‌లో ఇండోనేసియాకు పూర్తిస్థాయి సభ్యత్వం

అభివృద్ధి చెందుతున్న దేశాలతో కూడిన 'బ్రిక్స్' కూటమిలో ఇండోనేసియాకు పూర్తిస్థాయి సభ్యత్వం మంజూరైంది. ప్రస్తుతం బ్రిక్స్‌కు సారథ్యం వహిస్తున్న బ్రెజిల్ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇండోనేసియాకు బ్రిక్స్‌లో పూర్తిస్థాయి సభ్యత్వం కల్పించే ప్రతిపాదనకు 2023 ఆగస్టులోనే కూటమిలోని దేశాలు ఆమోదం తెలిపాయని వెల్లడించింది. జనాభాపరంగా ప్రపంచంలో నాలుగో అతిపెద్ద దేశం ఇండోనేసియా. గతేడాది అక్కడ ఏర్పాటైన ప్రభుత్వం బ్రిక్స్ కూటమిలో చేరాలని నిర్ణయించింది. ఆ మేరకు ఆసక్తిని కనబరుస్తూ బ్రిక్స్‌కు దరఖాస్తును సమర్పించింది.

"బ్రిక్స్ కూటమిలో పూర్తిస్థాయి సభ్యత్వం కలిగిన దేశంగా మారిన ఇండోనేసియాకు మేం స్వాగతం పలుకుతున్నాం. అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఇండోనేసియాకు చాలా ప్రాధాన్యత ఉంది. ప్రపంచ సుపరిపాలనలో సంస్కరణలకు ఈ కూర్పు దోహదం చేస్తుంది. దక్షిణ అమెరికాలోని దేశాలతో, ఆగ్నేయాసియా దేశాలతో సంబంధాల బలోపేతానికి ఈ పరిణామం దోహదం చేస్తుంది" అని పేర్కొంటూ బ్రెజిల్ ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది.

**భారత ఓటర్లుగా అండమాన్‌లో 'జరావా' తెగ ప్రజలు**

అండమాన్ నికోబార్ దీవులలోని ఆదిమ జరావా కమ్యూనిటీకి చెందిన 19 మంది సభ్యులను భారత ఓటర్ల జాబితాలో చేర్చి, వారికి ఐడీ కార్డులు అందించినట్లు సీనియర్ ఎన్నికల అధికారి ఒకరు తెలిపారు. అండమాన్ ఆదిమ జనజాతి వికాస్ సమితి(ఏఏజేవీఎస్) సహకారంతో ఎన్నికల అధికారులు స్వయంగా దక్షిణ అండమాన్ జిల్లాలోని జిర్కటాంగ్‌లో జరావా తెగ సభ్యులకు ఓటరు గుర్తింపు కార్డులను అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక సంస్కృతి, వైవిధ్యమైన జీవన విధానం కలిగిన ఈ జరావాస్ అటవీ వనరులపై ఆధారపడే బతికే ఓ భిన్నమైన తెగ.

ఎన్నో ఏళ్లుగా బయటి ప్రపంచానికి దూరంగా ఉన్న వీరు 1996లో వైద్య సహాయం నిమిత్తం పాలన యంత్రాంగంతో స్నేహపూర్వక సంబంధాన్ని ఏర్పరుచుకున్నారు. ప్రస్తుతం వీరిని భారత ఓటర్ల జాబితాలో చేర్చడం భారత ప్రజాస్వామ్య పరిణామంలో ఒక మైలురాయి అని అండమాన్ జిల్లా ఎన్నికల అధికారి అర్జున్ శర్మ పేర్కొన్నారు.

**అమెరికన్ కాంగ్రెస్ చట్టసభలో భగవద్గీతపై సుహాస్ ప్రమాణం**

అమెరికాలోని ఈస్ట్ కోస్ట్ ప్రాంతం నుంచి కాంగ్రెస్ చట్టసభకు ఎన్నికైన తొలి ఇండో అమెరికన్ సభ్యుడు సుహాస్ సుబ్రహ్మణ్యం హిందువుల పవిత్ర గ్రంథమైన భగవద్గీతపై ప్రమాణం చేసి తన బాధ్యతలను స్వీకరించారు. సుబ్రహ్మణ్యం మాతృమూర్తి ఈ దృశ్యాన్ని వీక్షించారు.

అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు మాజీ పాలసీ సలహాదారు అయిన సుబ్రహ్మణ్యం 2019లో వర్జీనియా జనరల్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడిగా ప్రమాణం చేసిన మరో ఇండో అమెరికన్ రాజా కృష్ణమూర్తి భగవద్గీత నుంచి ఓ భాగాన్ని చదివి వినిపించారు. 2013 జనవరిలో అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికైన తులసీ గబ్బార్డ్ భగవద్గీతపై ప్రమాణం చేసిన తొలి హిందూ అమెరికన్‌గా నిలిచారు.

**05 జనవరి**

**అంతర్జాతీయ విద్యార్థుల కోసం 2 ప్రత్యేక వీసాలు**

భారతదేశంలోని విద్యాసంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే అంతర్జాతీయ విద్యార్థుల కోసం ప్రభుత్వం రెండు ప్రత్యేక కేటగిరీ వీసాలను అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు 'ఇ-స్టూడెంట్ వీసా', 'ఇ-స్టూడెంట్-ఎక్స్' వీసాలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టింది.

వీటి దరఖాస్తు కోసం ప్రభుత్వం ప్రారంభించిన స్టడీ ఇన్ ఇండియా(ఎస్ఐఐ) పోర్టల్‌ను సందర్శించాలని అధికారులు తెలిపారు. ఎస్ఐఐ పోర్టల్‌లో నమోదు చేసుకున్న అర్హతగల విదేశీ విద్యార్థులు ఇ-స్టూడెంట్ వీసా సదుపాయాన్ని పొందవచ్చని, ఇవి కలిగి ఉన్న వారిపై ఆధారపడిన వారి కోసం ఇ-స్టూడెంట్-ఎక్స్ వీసాలు అందిస్తామని చెప్పారు.

**04 జనవరి**

**అమెరికాలో 14 మందికి ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం**

అమెరికా అత్యున్నత పురస్కారమైన ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడంను 14 మందికి అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. అమెరికా మాజీ విదేశాంగశాఖ మంత్రి హిల్లరీ క్లింటన్, ఫ్యాషన్ డిజైనర్ రాల్ఫ్ లారెన్, ఫుట్‌బాల్ సూపర్‌స్టార్ లియోనెల్ మెస్సీ, మాజీ రక్షణ మంత్రి దివంగత ఆష్టన్ కార్టర్, వివాదాస్పద పెట్టుబడిదారుడు జార్జ్ సోరోస్ ఈ పురస్కారానికి ఎంపికైన వారిలో ఉన్నారు. శ్వేత సౌధంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాలను బైడెన్ అందజేశారు. పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి వీటిని అందజేస్తారు.

**02 జనవరి**

**6జీ రేసులో స్టార్‌లింక్‌పై చైనా పైచేయి**

శరవేగంగా డేటాను ట్రాన్స్‌మిట్ చేయడంలో చైనా కీలక పురోగతి సాధించింది. ఆ దేశానికి చెందిన చాంగ్ గువాంగ్ శాటిలైట్ టెక్నాలజీ సంస్థ సెకనుకు 100 గిగాబిట్స్ డేటాను ట్రాన్స్‌మిట్ చేసేలా అత్యాధునిక హైరిజల్యూషన్ స్పేస్ టు గ్రౌండ్ లేజర్ ట్రాన్స్‌మిషన్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగంలో భాగంగా జిలిన్-1 ఉపగ్రహం నుంచి ట్రక్‌పై అమర్చిన గ్రౌండ్ స్టేషన్‌కు డేటాను పంపించింది.

ఇది గత రికార్డు కంటే దాదాపు 10 రెట్ల వేగంతో ప్రయాణించింది.ఆ సంస్థ లేజర్ గ్రౌండ్ కమ్యూనికేషన్స్ అధిపతి వాంగ్ హాంగ్‌హాంగ్ మాట్లాడుతూ.. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్ 6జీ టెక్నాలజీని అభివృద్ధి చేస్తోందన్నది అధికారికం కాదని తెలిపారు. తమ టెక్నాలజీ మస్క్ కంపెనీపై ఈ విషయంలో పైచేయి సాధించిందన్నారు.

**01 జనవరి**

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తాత్కాలిక సభ్యదేశంగా పాక్

ఐక్యరాజ్య సమితి (ఐరాస) భద్రతా మండలిలో పాకిస్థాన్ 2025, జనవరి 1 నుంచి తాత్కాలిక సభ్యదేశంగా చేరింది. జపాన్ స్థానంలో పాక్‌కు తాత్కాలిక సభ్య దేశ హోదా దక్కింది. పాక్‌కు ఈ హోదా దక్కడం ఇది ఎనిమిదో సారి.

ఈ దేశంతోపాటు డెన్మార్క్, గ్రీస్, పనామా, సోమాలియా కూడా కొత్తగా భద్రతా మండలిలోకి వచ్చాయి.

**షెంజెన్ దేశాల జాబితాలోకి రుమేనియా, బల్గేరియా**

రుమేనియా, బల్గేరియా దేశాలు షెంజెన్ జోన్‌లో పూర్తి సభ్యత్వం పొందాయి. 13 ఏళ్ల నిరీక్షణ తర్వాత రెండు దేశాలకు ఈ జోన్‌లో పూర్తిస్థాయిలో చోటు లభించింది. 2007లోనే యూరోపియన్ యూనియన్‌లో చేరిన రుమేనియా, బల్గేరియాకు షెంజెన్‌లో పాక్షిక సభ్యత్వం ఉంది. సరిహద్దు రక్షణ ఒప్పందం నేపథ్యంలో ఆస్ట్రియా ఈ దేశాలపై తన అభ్యంతరాలను వెనక్కి తీసుకోవడంతో వాటికి పూర్తిస్థాయి సభ్యత్వం లభించింది.

షెంజెన్ అంటే.. 29 ఐరోపా దేశాల సమాఖ్య. 90 రోజుల వరకు ఆయా దేశాల్లో పర్యటించేందుకు వీలుగా షెంజెన్ వీసాలను జారీ చేస్తుంటారు. ఈ వీసాతో ఇతర షెంజెన్ దేశాల్లోనూ పర్యటించేందుకు అనుమతి లభిస్తుంది. ఇటలీ, ఆస్ట్రియా, బెల్జియం, బల్గేరియా, క్రొయేషియా, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్ వంటి దేశాలు ఈ పరిధిలోకి వస్తాయి. ఇప్పుడు ఈ జాబితాలో రుమేనియా, బల్గేరియాలు చేరాయి.

– డా.పి.వి.రామ్, ఎం.ఏ, బి.ఈడి, పి.హెచ్.డి
విశాఖ సమాచారమ్ 9553574250

2nd pages111.qxd 5/10/2025 8:00 PM Page 6



## సభాపతి విరాళం నెల జీతం 2,17,000 విరాళం



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఉగ్రవాద నిర్మూలనలో సాయుధ దళాల ధైర్యసాహసాలు దేశ ప్రజలందరికీ గర్వకారణం అని,దేశ రక్షణ కోసం పోరాడుతున్న వీర జవాన్లకు సంఘీభావంగా ఒక నెల వేతనాన్ని రూ.2,17, 000 రూపాయలను, జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తన ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించారు.ఈ విరాళాన్ని ఆన్లైన్ ద్వారా శనివారం అందజేశారు.దేశభక్తి గల ప్రతీ పౌరుడు ఈ సేవా కార్యంలో భాగస్వామి కావాలని రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు.

## అమరవీరుడికి జర్నలిస్టుల నివాళి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** ఉగ్రవాదులను అంతమొందించడంలో భాగంగా వీర మరణం పొందిన తెలుగు జవాన్ మురళి నాయక్ కు అనకాపల్లి జర్నలిస్టులు ఘన నివాళి అందించారు. శనివారం ఆయన చిత్రపటానికే నివాళులర్పించి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ సత్యనారాయణ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. జోహార్ జోహార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఆర్. వి గోపాల్, పెంటకోట సత్యనారాయణ, మధుబాబు, అప్పారావు, స్వామి, రమేష్, లీగల్ జర్నలిస్ట్ సాయిరాం, అతిథిగా గ్రామీణ వైద్యుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆడారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని మాధవధారలో ఎమ్మెల్యే పూజలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని మాధవధార కుంచుమాంబ అమ్మవారి ఆలయంలో నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు శనివారం పూజలు చేశారు. ఆయనకు 50వ వార్డు టిడిపి అధ్యక్షులు సనపల వరప్రసాద్ స్వాగతం పలికారు.భారత సైనికులు,ప్రజలు క్షేమంగా ఉండాలని పూజలు చేశారు.ఉగ్రవాదాన్ని పోషిస్తూ భారతదేశంలోని అమాయక ప్రజలను పొట్టన పెట్టుకుంటున్న పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. దేశ భద్రత కోసం సరిహద్దులలో పోరాడుతున్న భారతీయ సైనికులు క్షేమంగా ఉండాలని వరప్రసాద్ కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ సురేష్ బాబు,51వ బిజెపి అధ్యక్షులు తమ్మినేని పద్మజ, 51వ వార్డు టీడీపీ అధ్యక్షులు సనపల కీర్తి, తాతినేని శ్రీనివాస్, కిల్లి శ్రీరామ్మూర్తి,దిలీప్ రాజు,సనపల నరసింహస్వామి, రామరాజ్యం, మూల వెంకట్రావు,దవళకుమారి, శాంతి,సనపల నాగచంద్రుడు, ఉదంతరావు, సనపల నారాయణస్వామి,పొన్నాడ రాంబాబు,కూటమి నాయకులు ఉన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాకవరపాలేనికి చెందిన లంక గణేష్(26) ఆరేళ్ల క్రితం తూటిపాలకు చెందిన శీరంరెడ్డి సుధారాణిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. గణేష్ హొటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజులుగా గణేష్ అత్తగారిల్లు అయిన తూటిపాలలోనే ఉంటున్నాడు. గురువారం మాకవరపాలెం వచ్చి మళ్లీ సాయంత్రం తూటిపాల వెళ్లాడు. శుక్రవారం ఉదయం సమీప జీడితోటలో ఉరివేసుకుని మరణించి కనిపించాడు. స్థానికులు అందించిన సమాచారంతో ఎస్ఐ దామోదర్‌నాయుడు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మృతుడి తల్లి నూకరత్నం ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, ఐదేళ్ల ఏళ్ల కుమారుడు ఉన్నారు.

# భక్తులకు నాణ్యమైన సేవలు అందిస్తాం

## నూతన ఈవో శీనా నాయక్



**ఇంద్రకీలాద్రి:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈవోగా వి.కె.శీనానాయక్ బాధ్యతలు స్వీకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఈవోకు దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజ చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈఈ కోటేశ్వరరావు దుర్గమ్మ చిత్రపటాన్ని ఈవోకు అందజేశారు. దేవస్థానంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలను ఇంజినీరింగ్, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తులకు నాణ్యమైన సేవలు అందించడం ఉద్యోగులు బాధ్యతగా భావించాలని సూచించారు. కశ్మీర్ టెర్రరిస్టు మూకల దాడుల్లో అమరులైన పర్యాటకుల కుటుంబాలు, దేశ రక్షణకోసం అహర్నిశలు శ్రమిస్తున్న త్రివిధ దళాలకు ప్రణాళికలు రూపొందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రజలకు ఆత్మస్థైర్యాన్ని అందించాలని దుర్గమ్మకు పూజలు చేసినట్లు ఈవో తెలిపారు. అనంతరం దేవస్థానంలో అన్నప్రసాదం, పులిహోర, లడ్డూల తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. అన్నప్రసాదానికి వినియోగించే బాయిలర్స్ మరమ్మతులు చేయించాల్సిన అవసరాన్ని గుర్తించి అధికారులకు పలు సూచనలు చేశారు. లడ్డు ప్రసాదం తయారీకి వినియోగించే దిట్ట వివరాలను ఏఈవో దుర్గారావు ఈవోకు తెలియజేశారు. దేవస్థానం చేపట్టిన ప్రసాదాల పోటు, అన్నప్రసాద కేంద్ర నిర్మాణ పనులను పరిశీలించారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళా హాస్టల్ వార్డెన్ మృతి



**పెద్దాపురం:** మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా హాస్టల్ వార్డెన్ నిండుకుండల నాగమల్లి (23) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. రౌతులపూడి మండలం మెరక సోమవారనికి చెందిన ఈమె ఏడాదిగా హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడటంతో కళాశాల సిబ్బంది పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రికి చేరుకున్న మృతురాలి తల్లితండ్రులు, బంధువులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మృతురాలి బంధువులు ఆస్పత్రి ఎదురుగా ఉన్న రోడ్డుపై బైఠాయించి యాజమాన్యం తప్పిందం వల్లే ఈ ఘటన జరిగిందని ఆత్మహత్య కాదు హత్యేనంటూ నినాదాలు చేశారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయలంటూ డిమాండ్ చేస్తూ మెరక సోమవరం గ్రామస్తులు, ప్రజా సంఘాలు ఆందోళన చేపట్టాయి. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు అక్కడకు చేరుకుని పూర్తిన్యాయం చేసేందుకు చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

**మనస్థాపంతోనే యువతి ఆత్మహత్య**

మనస్థాపంతోనే ఆ యువతి ఆత్మహత్యకు పాల్పడినట్టు గండేపల్లి ఎస్సై యూవీ శివ నాగబాబు తెలిపారు. ఆమె తన గ్రామానికి చెందిన శెట్టిబత్తుల శివ దుర్గను ప్రేమించిందన్నారు. శివ దుర్గ ఆమెను వివాహం చేసుకునేందుకు నిరాకరించడంతో మనస్థాపం చెంది ఆమె ఉంటున్న గదిలో సీలింగ్ ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకుని మృతి చెందినట్టు తెలిపారు. మృతురాలి తల్లి దేవుడమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్టు పేర్కొన్నారు.

## పిజిఆర్ఎస్‌కు 55 వినతులు



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 55 వినతులు అందాయి. సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ కె. చిరంజీవి నాగ వెంకట సాహిత్, డి ఆర్ ఓ కె. పద్మలత, ఎస్ సి ఎం వి ఎస్. లోకేశ్వరరావు సంయుక్తంగా వివిద మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 55 ఫిర్యాదులను స్వీకరించారు.జి.మాడుగుల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వి. కొండల రావు మెయిన్ రోడ్డు నుండి గ్రామానికి సిసి రోడ్డు నిర్మించాలని వినతి పత్రం సమర్పించారు. హుకుంపేట మండలం కొంతిలి గ్రామస్తురాలు వర్తన లింగమ్మ తమ ఉమ్మడి భూమిని పేర్కొన్నారు. పాడేరు మండలం పంపకం చేయాలని వినతి పత్రంలో వనుగుపల్లి పంచాయతీ కరకపుట్టు గ్రామస్తుడు ముదువ రాంబాబు భూపట్టాలో ఇంటి పేరు తప్పుగా నమోదైందని ఇంటిపేరు సవరించాలని ఫిర్యాదు చేసారు. హుకుంపేట మండలం కేంద్రానికి చెందిన పాడి బాలన్న అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని కోరారు. పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ బొడంగి పాడు గ్రామానికి చెందిన వంతాల లక్ష్మయ్య, గొల్లోరి శ్రీను, కొర్ర సత్యారావు, తదితరులు తమ గ్రామానికి విద్యుత్తు సౌకర్యం కల్పించాలని వినతి పత్రం అందజేసారు.ఈ కార్యక్రమం లో డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్. కుమార్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇ ఇ జవహార్ కుమార్, ఐటిడి ఏ పరిపాలనాధికారి ఎం. హేమలత, పాడేరు తాహశీల్దార్ వి. త్రినాధరావు నాయుడు, ఐసిడి ఎస్ పిడి పి. సూర్యలక్ష్మి, వివిద శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ భారతీయుడు భారత సైన్యానికి అండగా ఉన్నాడు






**అనపర్తి, (విశాఖ సమాచారమ్):-** పాకిస్తాన్ ప్రేరేపిత ముష్కరులపై ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత సైన్యం దాడి జరిపి వారిని మట్టుబెట్టడం, ప్రతిగా పాకిస్థాన్ సైన్యం బోర్డర్ లో సామాన్య ప్రజలపై దాడులు చేస్తున్న నేపథ్యంలో పాక్ దాడులను త్రిప్పికొడుతున్న భారతసైన్యానికి సంఘీభావం తెలియజేసేందుకు అనపర్తిలో నేడు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మరియు తూగో జిల్లా బిజెపి అధ్యక్షులు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. అనపర్తి దేవీచౌక్ నుండి గాంధీ మహాత్ముని విగ్రహం వరకూ జై జవాన్ నినాదాలతో కూటమి శ్రేణులు ర్యాలీ నిర్వహించి గాంధీ మహాత్ముని విగ్రహానికి పూలదండలు వేసి యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుడు మరళీనాయక్ కి నివాళులు అర్పించారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ.

భారతదేశ సమగ్రతను, సార్వభౌమత్వాన్ని కాపాడటం కోసం నరేంద్రమోడీ నాయకత్వంలో భారత సైనికులు "ఆపరేషన్ సింధూర్" పేరుతో ఉగ్రవాదాన్ని అణచడానికి పోరాటం చేస్తున్నారు.ఉగ్రవాదం పేరుతో భారత్ ని విచ్ఛిన్నం చేయాలని పాకిస్థాన్ చేసిన ప్రయత్నాలను నేడు నరేంద్రమోడీ నాయకత్వంలో సమర్ధవంతంగా త్రిప్పి కొట్టడం జరిగిందన్నారు.పాకిస్దాన్ లో వేళ్ళూనుకున్న ఉగ్రవాద శిబిరాలన్నింటినీ భారత సైనికులు కేవలం 25 నిమిషాల వ్యవధిలోనే ధ్వంసం చేయడం దానికి ప్రతిగా పాకిస్దాన్ మన బోర్డర్ లో ఉన్న సాధారణ పౌరులపై హింసను ప్రేరేపించి ప్రాణాలు తీయడానికి తెగబడ్డారని అన్నారు. ఇటువంటి పరిస్దితులలో ప్రతీ భారతీయుడు నరేంద్రమోడీ కీ, భారత సైన్యానికి, దేశానికి అండగా నిలవాలి అనే ఉద్దేశ్యంతో ప్రజలలో చైతన్యం తీసుకువచ్చేందుకు నేడు అనపర్తిలో కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు..ప్రతీ భారతీయుడు సైన్యానికి అండగా ఉన్నాడు. ఉగ్రవాద నిర్మూలనకు నరేంద్రమోడి గారు తీసుకున్న ప్రతీ నిర్ణయానికి భారతీయులందరూ మద్దతు ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కొవ్వూరు శ్రీనివాస్ రెడ్డి ( దత్తుడి శ్రీను ) టిడిపి సీనియర్ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, నల్లమిల్లి సుబ్బారెడ్డి, టిడిపి సోషల్ మీడియా సభ్యులు, సచివాలయం సిబ్బంది నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జి కోణాల వెంక రెడ్డి, తెలుగుదేశం బిజెపి జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీరమరణం పొందిన జవాన్‌కు ఘన నివాళులు అర్పించిన ఉపాధి హామీ కూలీలు



**నాతవరం, (విశాఖ సమాచారమ్):-** నాతవరం మండలం డి.ఎర్రవరం గ్రామంలో దేశ రక్షణలో భాగంగా పాకిస్థాన్ తో జరుగుతున్న యుద్ధంలో మన తెలుగు వాడైన సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం, గోరంట్ల మండలం గడ్డం తాండ పంచాయతీలోని కల్లి తాండ గ్రామానికి చెందిన తెలుగు వీర జవాన్ "మురళి నాయక్" మృతికి సంతాపంగా నాతవరం మండలం డి.యర్రవరం పంచాయతీలో ఉపాది హామీ శ్రామికులతో కలిసి మురళి నాయక్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించిన డి.యర్రవరం సర్పంచ్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు ఇనపసప్పల సత్య మాట్లాడుతూ దేశ భద్రత కోసం పాకిస్థాన్ తో జరుగుతున్న ధర్మ యుద్ధంలో మన తెలుగువాడైన జవాన్ "మురళి నాయక్" వీర మరణం చాలా బాధాకరమని, భరతమాత రక్షణలో తన ప్రాణాలర్పించిన ఆ అమర జవాన్ కు అశ్రునాయనాలతో శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని, యుద్ధం జరుగుతుందని తెలిసి కూడా ఇలాంటి జవాన్లను కని పెంచి యుద్ధానికి పంపించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని, నా పిల్లలు నా దగ్గరే ఉండాలనే కాకుండా నా దేశం బాగుండాలని ఎంతో ధైర్యంతో సైన్య రంగంలోకి పంపించినందుకు వారికి ముందుగా ధన్యవాదములు తెలుపుతున్నామని, వారి ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించాలని ఉపాది హామీ శ్రామికులతో కలిసి సత్య మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యతో పాటు ఉప సర్పంచ్ 'లాలం రామునాయుడు', పంచాయతీ పార్టీ ప్రెసిడెంట్ 'సబ్బవరపు స్వామినాయుడు', ఉపాధ్యక్షుడు 'దుండు రాంప్రసాద్', బూత్ కన్వీనర్లు 'అంకంరెడ్డి రామకృష్ణ', 'చింతంరెడ్డి బెన్నయ్య నాయుడు', మండల తెలుగు యువత సెక్రటరీ 'అంకంరెడ్డి కిషోర్' తదితరులు పాల్గొన్నారు.

## తైపురంలో ప్రభుత్వ భూమి కబ్జా...!!

ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆందోళన



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** మండలంలో తైపురం గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జా చేసిన సంఘటన గ్రామ పెద్దలు, ప్రజలు ఆందోళన తో వెలుగులోకి వచ్చింది. లక్షల రూపాయల విలువైన భూమి అడ్డుకొనే నాధుడే కరువు అంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులపై తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రాగునీటి బోరు సైతం కబ్జా కోరులు దౌర్జన్యం గా ధ్వంసం చేశారు. వివరాలు ప్రకారం రాజాం గ్రామానికి చెందిన నందిగుళ్ల సాంబయ్యకు గతంలో రెండు ఎకరాల 70 సెంట్లు డిఫారం పట్ట మంజూరు అయ్యిందని అయితే దానిని అదే గ్రామానికి చెందిన కొల్లు రాజు అనే వ్యక్తికి మొదటి అమ్మకం తైపురం గ్రామానికి చెందిన చెందిన అల్లం అప్పారావు రెండవ అమ్మకం చేశారు. గాజువాక దరి మిందికి చెందిన సూర్యనారాయణ అనే వ్యక్తికి అమ్మడం జరిగిందని సూర్యనారాయణ గత 23 సంవత్సరాల సాగులో ఉన్నప్పటికీ గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో కొంత భూమిని జగనన్న కాలనీకి ప్రభుత్వ హెల్త్ సెంటర్ కు కేటాయించి నిర్మాణాలు చేపట్టారని ప్రభుత్వ హెల్త్ సెంటర్ కు ఆనుకొని త్రాగునీటి 100 లీటర్ల తాగునీటి బోరు, వాటర్ ట్యాంక్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందని గత రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రాగునీటి బోరుతోపాటు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారని వారిపై తక్షణమే చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆస్తులు కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## సీ.ఎం.ఆర్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం




**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):-** మున్సిపాలిటీలోని సిఎంఆర్ షాపింగ్ మాల్ లో శనివారం సీఎంఆర్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో స్థానిక గవర్నమెంట్ ఎన్టీఆర్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్టీఆర్ ఏరియా హాస్పిటల్ సూపరింటెంట్ డాక్టర్ సుధా శారద ప్రారంభించారు.ఈ సందర్భంగా సుధా శారద తో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని తద్వారా మరొక ప్రాణాలను కాపాడిన వారు అవుతారని ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు.సీఎంఆర్ షాపింగ్ మాల్ మేనేజర్ కాసిమ్మ మాట్లాడుతూ సిఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత మావూరు వెంకటరమణ ఆదేశాల మేరకు ఈరోజు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని ఈ కార్యక్రమంలో సిఎంఆర్ షాపింగ్ మాల్ సిబ్బంది మరియు ప్రజలు కలిపి 50 యూనిట్లు రక్తం దానం చేయడం జరిగిందని, భవిష్యత్తులో ఇటువంటి మరిన్ని కార్యక్రమంలు నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అపర్ణ, ఏరియా హాస్పిటల్ సిబ్బంది మరియు బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీరాముడిగా శ్రీవారు



**ద్వారకాతిరుమల:** వైశాఖ మాస తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ద్వారకాధీశుడు భక్తులపై దివ్య కాంతులను ప్రసరింపజేస్తూ సూర్యప్రభ వాహనంపై గ్రామంలో విహరించారు. రాత్రికి చల్లని వాతావరణంలో చంద్రప్రభ వాహనంపై ఊరేగారు. రోజుకో విశేష అలంకారంలో భాగంగా స్వామివారు శ్రీరామ అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీవారి ఆలయానికి తూర్పు వైపున ఉన్న శ్రీహరి కళాతోరణంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉదయం 7 గంటలకు హనుమద్వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం

రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవంః రాత్రి 8.30గంటలకు వెండి శేష వాహనంపై గ్రామోత్సవం.

## కలెక్టర్ ప్రశాంతికి రెడ్‌క్రాస్ పురస్కారం



**రాజమహేంద్రవరం:** గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి రెడ్‌క్రాస్ పురస్కారం అందుకున్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్‌భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమెకు గవర్నర్ ఈ పురస్కారం, ప్రశంసా పత్రం అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పని చేసిన సమయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలకు విస్తృత ప్రచారం కల్పించడం, ప్రజాప్రయోజనాల నేపథ్యంలో పలు కార్యక్రమాలు చేపట్టినందుకు గాను ఆమె ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా రెడ్‌క్రాస్ కార్యక్రమాలు, సభ్యత్వ నమోదుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కోరారు. ముఖ్యంగా యూత్ రెడ్‌క్రాస్ సభ్యులుగా విద్యార్థులను చేర్పించాలని సూచించారు.

# ఎన్నేళ్లీ రెడ్ సిగ్నల్?



**అమలాపురం:** కోనసీమ ప్రజల చిరకాల వాంఛ కాకినాడ – నర్సాపురం రైల్వే లైన్. దీని నిర్మాణానికి 2004లో పునాది పడింది. 21 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. కాకినాడ నుంచి కోటిపల్లి వరకూ రైల్వే లైన్ పనులు పూర్తయ్యాయి. మొత్తం ప్రాజెక్టు పొడవు 102.507 కిలోమీటర్లు కాగా, కోటిపల్లి వరకూ 45.30 మేర పూర్తయ్యింది. బ్రిటిష్ కాలంలో 1928 నుంచి 1940 వరకు కాకినాడ నుంచి కోటిపల్లి వరకు రైల్వే లైన్ ఉండేది. తరువాత నిలిచిపోగా 2004లో తిరిగి మొదలైంది. తొలుత చైన్నె నుంచి కాకినాడ మధ్య తిరిగే సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను కాకినాడ – కోటిపల్లి మధ్య ప్యాసింజర్‌గా తిప్పేవారు. భారీ నష్టాలు వస్తూండటంతో తరువాత రైలు బస్సు ప్రవేశపెట్టారు. ఇది చాలాకాలం సేవలందించింది. ఇది కూడా నష్టదాయకమని నిలిపివేశారు. ఆరేళ్లుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇదే సమయంలో కోట్ల రూపాయల లాభాలు తెచ్చిపెట్టిన బియ్యం ఎగుమతులను కూడా నిలిపివేయడం గమనార్హం. కోటిపల్లి నుంచి వ్యాగన్ల ద్వారా ఇసుక కూడా ఎగుమతి అయ్యేది. గతంలో రామచంద్రపురం స్టేషన్ నుంచి బియ్యం ఎగుమతులు జోరుగా సాగేవి. నెలకు రూ.5 కోట్ల వరకు ఆదాయం వచ్చేది. అయితే ఇతర ప్రాంతాల ఎగుమతిదారుల నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా ఇక్కడకు రైల్వే అధికారులు గూడ్స్ రైలు పంపలేదనే విమర్శలున్నాయి.

**ట్రాక్ మీద తుప్పలు.. శిథిలమైన స్టేషన్లు**

కాకినాడ – కోటిపల్లి మధ్య ఆరేళ్లుగా రైలు రాకపోకలు నిలిచిపోవడంతో రైల్వే ట్రాక్, స్టేషన్లు ధ్వంసమవుతున్నాయి. రైల్వే ట్రాక్‌పై పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. ట్రాక్ మీద వేసిన రాళ్లు చెల్లాచెదురయ్యాయి. రోడ్డు క్రాస్ చేసే చోట ఏర్పాటు చేసిన గేట్లు ఊడిపోయాయి. చిన్నచిన్న ఇనుప, ఇతర విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయి. స్టేషన్లు సైతం ధ్వంసమయ్యాయి. గుమ్మాలు, ఇతర వస్తువులు తరలించుకుపోయారు. భవనాల కిటికీలు కూడా ఊడిపోయాయి. స్టేషన్, ప్లాట్‌ఫామ్‌ల మీద కూడా పిచ్చి మొక్కలు మొలిచాయి. ఈ రైల్వే లైన్‌లో అతి పెద్ద స్టేషన్ అయిన రామచంద్రపురం పరిస్థితి మరీ దారుణం. బహిరంగ మరుగుదొడ్డిగా మారిపోయింది. జిల్లా పరిధిలోకి వచ్చే కోటిపల్లి, దంగేరు, ద్రాక్షారామ, రామచంద్రపురం వంటి స్టేషన్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి.

కాకినాడ – కోటిపల్లి రైల్వే లైన్ విద్యుద్దీకరణకు నిధులు కేటాయించినా పనులు జరగడం లేదు. మొత్తం రూ.90 కోట్లు అయ్యే ఈ పనులకు 2023–24లో రూ.9 కోట్లు, 2024–25లో రూ.21 కోట్ల చొప్పున మొత్తం రూ.30 కోట్లు కేటాయించారు. కానీ పనులు మొదలు కాలేదు. పాత రైల్వే లైన్ మరమ్మతులకు రూ.10 కోట్లు కేటాయించినా పనులు చేయడం లేదని ఈ ప్రాంత వాసులు చెబుతున్నారు. కనీసం ఉన్న రైల్వే లైన్‌ను వినియోగంలోకి తీసుకు రావాలని కోరుతున్నారు.

**అమలాపురం వరకు పూర్తి చేయాలి**

కాకినాడ – నర్సాపురం రైల్వేలైన్‌లో గౌతమీ వంతెనకు సంబంధించి పియర్ల నిర్మాణం పూర్తయ్యింది. గెడ్డర్లకు టెండర్లు పూర్తి కావడంతో పనులు జరుగుతున్నాయి. వంతెన దాటిన తరువాత పది కిలోమీటర్ల ట్రాక్ నిర్మాణం పూర్తయితే అమలాపురం వరకు రైలు వచ్చే అవకాశముంది. దీనివల్ల రైల్వేకు ప్రయాణికుల ఆదాయం, గూడ్స్ ఆదాయం కూడా పెరుగుతుంది.

# ఘనంగా అరుంధతీ నక్షత్ర దర్శనం



**అన్నవరం, (విశాఖ సమాచారమ్):–** వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన నవ దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ దేవి అమ్మవార్లకు దర్బారు మండపంలో స్థాలీపాక హోమాలు ఘనంగా నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లను తూర్పు రాజగోపురం ముందుకు మంగళవాయిద్య ఘోష నడుమ ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు పండితులు అరుంధతీ నక్షత్రం చూపించి, పూజలు చేశారు. కార్యక్రమంలో వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, వైదిక కమిటీ సభ్యుడు చామర్తి కన్నబాబు, వ్రత పురోహితులు పాలంకి పట్టాభి, అంగర సతీష్, కొంపెల్ల మూర్తి, అర్చకులు దత్తాత్రేయశర్మ, సుధీర్, పరిచారకులు పవన్ పాల్గొన్నారు.

**రావణబ్రహ్మ వాహనంపై సత్యదేవుని ఊరేగింపు**

సత్యదేవుడు, అమ్మవారిని రాత్రి రావణబ్రహ్మ, వాహనంపై ఘనంగా ఊరేగించారు. రాత్రి 9 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పండితులు కొండ దిగువన ఉన్న తొలి పావంచా వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన రావణబ్రహ్మ వాహనంపై వేంచేయించి, పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దర్శించి పూజలు చేశారు. అనంతరం రావణబ్రహ్మ వాహనం ముందు కుంభపు రాశి వేసి, కొబ్బరి కాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. తొలి పావంచా నుంచి ఆంధ్రా బ్యాంక్ సెంటర్ వరకూ, తిరిగి తొలి పావంచా వరకూ ఈ ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా పలువురు కళాకారులు వివిధ కళారూపాలను ప్రదర్శించారు. ఈ ఊరేగింపు నేపథ్యంలో గ్రామంలోకి భారీ వాహనాలను అనుమతించలేదు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఊరేగింపును చూసేందుకు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఊరేగింపు సాగినంతసేపూ బాణసంచా కాల్చారు.

# భవిష్యత్‌లో చైనా టెక్నాలజీతో విగ్రహాలు



**కొత్తపేట, (విశాఖ సమాచారమ్):–** చైనా టెక్నాలజీని భవిష్యత్‌లో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఆ తరహా విగ్రహాలు రూపకల్పనపై దృష్టి సారించనున్నట్టు అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డీ రాజ్‌కుమార్‌వుడయార్ తెలిపారు. చైనాలో నూతన టెక్నాలజీతో విగ్రహాల తయారీపై జరిగిన సెమినార్‌లో రాష్ట్రం నుంచి ఆయన పాల్గొన్నారు. శుక్రవారం ఆ సెమినార్ విశేషాలను వివరించారు. వారం రోజుల పాటు సాగిన సెమినార్‌లో 250 దేశాల నుంచి వివిధ రకాల విగ్రహాల శిల్పులు పాల్గొన్నారన్నారు. ఇక్కడ సిమెంట్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కాంస్యంతో విగ్రహాలు తయారు చేస్తున్నామని, అక్కడ వీటితో పాటు ఇంకా అనేక రకాల లోహాలతో విగ్రహాలు తయారు చేస్తున్నారని తెలిపారు. భారీ కాంస్య విగ్రహాలను నిర్మించడంలో చైనా కంపెనీలకు ప్రపంచ వ్యాప్తంగా పేరుందన్నారు. సంప్రదాయ క్యాస్టింగ్ పద్ధతులకు ఆధునిక టెక్నాలజీని కలిపి భారీ స్థాయి విగ్రహాలను చైనా కంపెనీలు తయారు చేస్తున్నాయని, అత్యంత ఎత్తైన విగ్రహాలు కూడా ఆ దేశం టెక్నాలజీ ద్వారానే తయారవుతున్నాయన్నారు.

ముందు చిన్న నమూనా విగ్రహం తయారుచేసి, దానిని 3 డీ స్కానింగ్ చేసి, కంప్యూటర్ డిజైనింగ్ ద్వారా కోరుకున్న సైజుకు ఇమేజ్‌ను పెంచుతారని తెలిపారు. ఎత్తైన విగ్రహాల విడి భాగాలను సులభంగా పోత పోసేందుకు ఫౌండ్రీలు ఉన్నాయని తెలిపారు. పెద్ద పెద్ద ఫౌండ్రీల వల్ల తక్కువ సమయంలో విడి భాగాలను తయారుచేసే వీలు ఉంటుందన్నారు. భారీ విగ్రహాలు నెలకొల్పే విషయంలో వివిధ దేశాలు, రాష్ట్రాలు చైనా కంపెనీల వైపు మొగ్గు చూపుతున్నాయన్నారు. విగ్రహాలే కాక పార్కులు, సాంస్కృతిక చిహ్నాలు, వివిధ కళాకృతులు నిర్మిస్తారని తెలిపారు.

# భారతీయుల రూటే.. సపరేటు



**అమరావతి :** ఋగ్వేదంలోనే యోగా గురించి ప్రస్తావించాం. సింధు లోయ నాగరికతలోనే టాయిలెట్లను వినియోగించాం. గూస్బెర్రీ వంటి మొక్కల సారాన్ని వినియోగించి షాంపూలు తయారు చేశాం.. 'సున్నా'కు విలువ కనిపెట్టి ప్రపంచానికి అందించాం. ఇలా విశ్వజగతికి భారతీయులు ఆది నుంచి నాయకులుగానే పరిచయమయ్యారు. నేటికీ అదే విధంగా ఉండేందుకు, గ్లోబల్ లీడర్లుగా పిలిపించుకునేందుకు భారతీయులు ఇష్టపడుతున్నారు. అందుకోసమే కష్టాన్నీ సంతోషంగా స్వీకరిస్తున్నారు.

ప్రపంచ ప్రముఖ కార్యనిర్వాహక పరిశోధన సంస్థ అయిన అమ్రోప్ నిర్వహించిన అధ్యయనంలో భారత్ ప్రజల తాజా మనోగతం ఆవిష్కృతమైంది. గ్లోబల్ సౌత్ దేశాలైన భారత్, చైనా, బ్రెజిల్‌తోపాటు పాశ్చాత్య దేశాలైన అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, పోలాండ్‌లో పని వైఖరిపై అమ్రోప్ తాజాగా అధ్యయనం జరిపింది.

కష్టించి పనిచేయడం వల్లనే గుర్తింపు లభిస్తుందని, జీవితం సంతృప్తికరంగా ఉంటుందని, ఆశయం నెరవేరుతుందని భారతీయులు నమ్ముతున్నట్లు ఈ అధ్యయనంలో తేలింది. ఈ సర్వేలో 20 ఏళ్లు నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల బ్యాచిలర్ డిగ్రీ, అంతకంటే ఎక్కువ విద్యార్హత ఉన్న 8 వేల మంది నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రతి దేశం నుంచి వెయ్యి మంది సర్వేలో పాల్గొన్నారు.

**అధ్యయనంలోని ముఖ్యాంశాలు:**

' భారతీయుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతున్నాయి. 92 శాతం మంది పని చేయడం లోనే సంతోషం ఉందని అంటున్నారు.

' 73% మంది మంచి ఉద్యోగం, జీవితం ఉండాలని కోరుకుంటున్నారు.

'75% మంది కష్టపడి పనిచేయడం సాధారణంగా మనిషి ధర్మమని నమ్ముతున్నారు.

' 42% మంది వారానికి 40 గంటలకు మించి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇది ఫ్రాన్స్‌లో 16 శాతంగా ఉంది.

' 76 శాతం మంది భారతీయ నిపుణులు ఒక కంపెనీని నడిపించాలని లేదా తామే సొంతంగా ఒక సంస్థను నిర్వహించాలని కోరుకుంటున్నారు. జర్మనీలో ఇలాంటి వారు 36% కాగా, అమెరికాలో 49% మంది ఉన్నారు.

' తామేంటో నిరూపించుకునేలా పనిచేయాలని 73% మంది భారతీయులు అనుకుంటున్నారు. జర్మనీలో ఇలాంటి వారి సంఖ్య 41 శాతం మాత్రమే ఉంది.

'మన దేశంలో 84 శాతం మందికి చదువు, వ్యాపారం, ఉద్యోగం వంటి మంచి కెరీర్ ముఖ్యంగా భావిస్తున్నారు.

'పాశ్చాత్య దేశాల్లో మాత్రం 62% మంది తాము కుటుంబానికే ప్రాధాన్యత ఇస్తామని పేర్కొనడం గమనార్హం.

' రాజకీయ నాయకుడిగా ఉండేందుకు మాత్రం ప్రపంచ వ్యాప్తంగా 40 శాతం మంది ఇష్టపడటం లేదు.

# అడ్డొచ్చింది.. కూల్చేశాం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** పెందుర్తి నియోజకవర్గంలో అధికార కూటమి నాయకుల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. మండలంలోని గొరపల్లిలో పాత మంచినీటి పథకం ట్యాంక్‌ను జనసేన, టీడీపీ నాయకులు రాత్రికి రాత్రే కూల్చేశారు. తమ సొంత అవసరాలకు ఈ ట్యాంక్ అడ్డు వస్తుందన్న కారణంతో, పంచాయతీ, మండల పరిషత్ అధికారుల అనుమతి లేకుండా దౌర్జన్యకాండకు దిగారు. సొంత నిధులతో జేసీబీని సమకూర్చి ట్యాంక్‌ను కూలగొట్టారు. అర్ధరాత్రి వరకు ఆ శిథిలాలను తొలగించేందుకు ప్రయత్నించారు.

సాధారణంగా పంచాయతీ పరిధిలో ఉన్న ఏ పాత భవనం, మంచినీటి పథకం, ఇతర ప్రభుత్వ నిర్మాణాలను కూలగొట్టాలంటే నిబంధనల ప్రకారం పంచాయతీ తీర్మానం తప్పనిసరి. అదే సమయంలో మండల పరిషత్ అనుమతి కూడా ఉండాలి. కానీ, ఇటీవల కాలంలో నియోజకవర్గంలో ఆ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. రెండు నెలల క్రితం జెర్రిపోతులపాలెంలో కల్యాణ మండపం నిర్మించడానికి ఏకంగా అంగన్‌వాడీ కేంద్రం భవనాన్నే కూల్చేయడానికి కూటమి నాయకులు ప్రయత్నించారు. తాజాగా గొరపల్లిలో స్థానిక జనసేన, టీడీపీ కార్యకర్తలు దగ్గరుండి మరీ మంచినీటి పథకం ట్యాంక్‌ను కూల్చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో కొల్లి వెంకట్రావును వివరణ కోరగా, గొరపల్లిలో మంచినీటి పథకం ట్యాంక్ కూల్చివేతకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని తెలిపారు. పంచాయతీ నుంచి సదరు ట్యాంక్ కూల్చివేతకు ప్రతిపాదన లేదని సర్పంచ్ గొరపల్లి శ్రీను తెలిపారు.

## పాకిస్థాన్‌పై అసదుద్దీన్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్:** పాక్‌కు ఇస్లాం పేరు పలికే అర్హత లేదని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. భారత్ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. పాక్ దాడులకు మించి భారత్ దాడి చేస్తుందన్నారు. "దేవుడి దయతో మనం భారత భూమిని జన్మించాం. భారత భూమి కోసం ప్రాణాలైన ఇస్తాం. ఇస్లాం పేరుతో పాక్ అసత్య ప్రచారం చేస్తోంది. అమాయకులను, చిన్న పిల్లలను చంపమని ఇస్లాం చెప్పలేదు" అని అసదుద్దీన్ పేర్కొన్నారు. పాకిస్థాన్ ఆర్మీ జనాలను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతుందని, దానికి తగిన మూల్యం చెల్లించుకుంటుందని అసదుద్దీన్ అన్నారు. ఇస్లాం పేరుతో పాకిస్థాన్ మారణహోమం సృష్టిస్తుంది. అమాయకులను, చిన్న పిల్లలను చంపడం దారుణమన్నారు. అమ్మ కడుపులో నుండి ఈ భూమిపై పడినప్పుడు.. చచ్చే వరకు ఈ భూమి కోసమే బతకాలి' అని అసదుద్దీన్ అన్నారు.

# ఇదేం ప్రజాస్వామ్యం!






**రాజమహేంద్రవరం:** కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యానికి విలువ లేకుండా పోతోందని ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తుతున్నారు. పత్రికల్లో వస్తున్న వ్యతిరేక కథనాలు వచ్చాయని భావిస్తే ఖండన ఇవ్వాలే తప్ప భౌతిక దాడులకు పాల్పడటం హేయమైన చర్యగా అభివర్ణిస్తున్నారు. ఎటువంటి ముందస్తు నోటీసులూ లేకుండా విజయవాడలోని సాక్షి సంపాదకులు ఆర్.ధనంజయరెడ్డి నివాసంలో పోలీసులు అక్రమంగా సోదాలు చేయడాన్ని ఖండించారు. గతంలో ఎన్నడూ, ఏ ప్రభుత్వాలూ ఇటువంటి దాడులు చేయించిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విలేకరులపై, కార్యాలయాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఇవన్నీ చూస్తూంటే బ్రిటిష్ పాలన గుర్తుకొస్తోందని అన్నారు. తీరు మార్చుకుంటే కూటమి ప్రభుత్వానికి జర్నలిస్టులు తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

**రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా?**

భారత రాజ్యాంగంలో పత్రికల పాత్ర కీలకం. రాజ్యాంగానికిది నాలుగో స్తంభం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న పత్రికలపై దాడి చేయడం హేయమైన చర్య. రాష్ట్రంలో ప్రశ్నించే వాడే ఉండకూడదకుంటే ఎలా? భయపెట్టి ఎంతకాలం రాజకీయం, పరిపాలన చేయగలరు? ప్రశ్నించే వారిని భయభ్రాంతులకు గురి చేయడం కొన్ని రోజులుగా పరిపాటిగా మారుతోంది. ఇలాంటి చర్యలు ప్రభుత్వానికి మంచిది కాదు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లోకి ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా చొరబడి, దురుసుగా ప్రవర్తించడం ద్వారా రాష్ట్ర ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారో అర్థం కావడం లేదు.

**తాటిపాక మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి**

**పత్రికా స్వేచ్ఛను హరించే హక్కు ఎవ్వరికీ లేదు**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ఎత్తి చూపడం మీడియా బాధ్యత. ఆ బాధ్యత నిర్వర్తిస్తున్న మీడియా మీద, జర్నలిస్టులపై కేసులు బనాయించడం సమర్థనీయం కాదు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికా స్వేచ్ఛను హరించే హక్కు ఏ ఒక్కరికీ లేదనే విషయం గుర్తించాలి. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే ఇలాంటి విధానాలు మానుకోవాలి. ఏదైనా ఉంటే ఉంటే చట్టబద్ధంగా చూసుకోవాలి. ఎలాంటి నోటీసులూ లేకుండా బెదిరింపు చర్యలకు దిగడం సరైన విధానం కాదు.

**మండెల శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే**

**పాత్రికేయులపై కక్ష సాధింపు బాధాకరం**

పాలకుల వేధింపులతో జర్నలిజాన్ని ఖూనీ చేస్తున్నారు. పాలకుల వైఖరి చూస్తూంటే సామాన్య ప్రజలు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. సుప్రీం నిబంధనలకు వ్యతిరేకంగా జర్నలిస్టుల ఇళ్లలో కూడా పాలకులు సోదాలు చేయడం చట్ట వ్యతిరేక చర్య కాదా? ఇలాంటి చర్యలు భవిష్యత్తులో వ్యవస్థకు పెను ప్రమాదంగా మారుతాయి. ఈ పరిస్థితులు ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టకు మకిలి పట్టించే విధంగా ఉన్నాయి. కక్షలు, కార్పణ్యాలకు రాజకీయ అధికారాన్ని అడ్డం పెట్టుకొని పాలనను భ్రష్టు పట్టిస్తే ప్రజల్లో తిరుగుబాటు రావటం ఖాయం.

**మేడా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి, జర్నలిస్ట్ డెమోక్రటిక్ రైట్స్ ఫోరం**

**అందరూ ఖండించాలి**

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా సమాచారం అందించేందుకు పత్రికలు కృషి చేస్తాయి. ప్రజల సమస్యలను, ప్రభుత్వ విధానాలను స్వేచ్ఛగా ప్రచురించే హక్కు పత్రికలకు ప్రజాస్వామ్యంలో భారత రాజ్యాంగం కల్పించిన హక్కు. పత్రికా విలేకరులపై ఎడిటర్లపై పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించి భయభ్రాంతులకు గురి చేయడాన్ని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యవాదులందరిపై ఉంది.

**డాక్టర్ గుబ్బల రాంబాబు, చైర్మన్, అంబేద్కర్ సేవా కేంద్రం(ఆస్క్), రాజమహేంద్రవరం**

# ఉత్సాహంగా ఉషూ ఎంపిక పోటీలు

**శ్రీకాకుళం న్యూకాలనీ:** జిల్లా స్థాయి ఉషూ ఎంపిక పోటీలు ఆద్యంతం హోరాహోరీగా సాగాయి. జిల్లా ఉసూ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం జిల్లాస్థాయి సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ ఉషూ ఎంపిక పోటీలు నిర్వహించారు. అంతకుముందు ఉదయం ఈ ఎంపిక పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డాక్టర్ కె.శ్రీధర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతతతో పాటు ఉజ్వల భవిష్యత్ కూడా సొంతమవుతుందన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి మాట్లాడుతూ ఉషూ క్రీడాకారులు దశాబ్దకాలంగా రాష్ట్ర, జాతీయస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడం సంతోషకరమన్నారు. ఇక్కడ ఎంపికై న క్రీడాకారులను ఈ నెల 12 నుంచి 14 వరకు కర్నూలులో జరగనున్న రాష్ట్రస్థాయి ఉషూ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని ఉషూ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రెడ్డి శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌ఎంయూ కార్యాలయంపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** వాల్తేర్ ఆర్టీసీ డిపో ఎన్‌ఎంయూ కార్యాలయంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు ఆ సంస్థ డిపో చైర్మన్ బండి రవి తెలిపారు. గురువారం రాత్రి డిపో ఆవరణలో ఉన్న తమ కార్యాలయంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి ఫర్నిచర్, కార్యాలయ ప్రాంగణాన్ని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కార్యాలయం సిబ్బంది వచ్చి చూడగా పరిసరాలు చిందరవందరగా ఉండటంతో కుర్చీలు, ఇతర ఫర్నీచర్ వస్తువులు ధ్వంసమై ఉన్నాయన్నారు. ఫ్లెక్సీని సైతం చించేశారన్నారు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఎన్‌ఎంయూ డిపో యాజమాన్యంపై అక్కసుతోనే ఈ దాడికి పాల్పడినట్లు సంస్థ డిపో కార్యదర్శి వసంతరావు.

